నవతెలంగాణ
1
మెదక్
ఆదివారం | 21 జులై 2024 | www.navatelangana.com

రక్తదాతలకు ఉత్తమ పురస్కారం



నవతెలంగాణ-రాయికోడ్

అన్ని దానాల్లోకెల్లా రక్తదానంఉత్తమమైనదని.. ఈ దానం మరో ప్రాణాన్ని కాపాడుతుందని రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. రాయికోడ్ మండలం కర్చల్ గ్రామానికి చెందిన పట్లోళ్ల మహిపాల్‌రెడ్డి చాలాసార్లు రక్తదానం చేసినందున.. అయనకు హైదరాబాదులోని వైశ్య భవన్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేతుల మీదుగా ఉత్తమ రక్తదాతల పురస్కారం ప్రశంసా పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో తలసేమియా వ్యాధి బారిన పడిన చిన్నారులకు 2036 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు నమోదు కావడానికి కృషి చేయడం జరిగిందన్నారు. అనంతరం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా రక్తదానం చేస్తున్నట్టు చెప్పారు.

హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ తారా కాలేజ్ హాస్టల్‌లో శనివారం సర్వే చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కాలేజ్ హాస్టల్ విద్యార్థులకు ప్యాకెట్ మనీ రూ.1000 ఇవ్వాలని కోరారు. కాలేజీ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలన్నారు. హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, జశ్వంత్, గణేష్ పాల్గొన్నారు.

మత్స్య సంఘం చైర్మెన్‌ను కలిసిన డైరెక్టర్లు



నవతెలంగాణ-జిన్నారం

తెలంగాణ రాష్ట్ర మత్స్యకారుల సంఘం చైర్మెన్‌గా నియామకమైన మెట్టు సాయికుమార్‌ను సంగారెడ్డి జిల్లా మత్స్య సంఘం డైరెక్టర్లు సుంకర బోయిన మహేష్ బృందం శనివారం ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్‌ను శాలువాలతో సత్కరించారు. మత్స్య సంఘాల సంక్షేమం, మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుంకరబోయిన మహేష్, వావిలాల్ సింగిల్ విండో డైరెక్టర్ పర్వతాలు, మల్లేష్ పాల్గొన్నారు.

కోర్టు తీర్పును అమలు చేయాలి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని పదోవార్డు కౌన్సిలర్ శైలజను అనర్హురాలిగా ప్రకటిస్తూ జిల్లా జడ్జి ఇచ్చిన జడ్జిమెంట్ కాపీని మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు శనివారం కమిషనర్ మంగతాయారుకి అందజేశారు. కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఇండిపెండెంట్ అభ్యర్థి నరసింహరాజు ఎన్నికను లాంచనంగా ప్రకటించి తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపా ధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పుల్లగూర్ల లక్ష్మారెడ్డి, సీనియర్ నేత గుండ్ల మహేందర్ రెడ్డి, కౌన్సిలర్ వారాల గోపాలమ్మ, ఇండిపెండెంట్ అభ్యర్థి నరసింహ రాజు, వెంకటయ్య,యువజన నాయకుడు ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చక్కర క్రషింగ్ కోసం ఫ్యాక్టరీ అగ్రిమెంట్



నవతెలంగాణ-న్యాల్‌కల్ : మాటూర్ గ్రామ శివారులో గోదావరి గంగా ఆగ్రో లిమిటెడ్ ప్రోడక్ట్ చక్కెర ఫ్యాక్టరీ.. 2024 సంవత్సరానికి చెరుకు క్రషింగ్‌కు నూతనంగా ప్రారంభం చేస్తున్నట్టు ఆ ఫ్యాక్టరీ ఎండి సచిన్ గోయల్ రైతులతో ఫ్యాక్టరీ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ మేరకు రేజింతల్ గ్రామంలో శనివారం రైతులతో అవగాహన కల్పిస్తూ ఆయన మాట్లాడారు. చక్కెర ఫ్యాక్టరీలో నవంబర్ నాటికి గానుగ ప్రారంభిస్తామన్నారు. ఫ్యాక్టరీ చెరుకు తరలింపునకు 80 గ్యాంగ్ లేబర్‌లకు అడ్వా న్స్ ఇచ్చామని 15 రోజుల్లో బిల్లులు చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి సచిన్ గోయల్, కేన్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఫీల్డ్‌మెన్ శ్రీనివాస్, రైతులు శ్రీనివాస్ రెడ్డి,సూరప్ప, విష్ణు, తిరుపతిరెడ్డి, సంగప్ప, మోహన్ రెడ్డి తదితరులున్నారు.

కమ్ముకున్న ముసురు



- ఉమ్మడి మెదక్ జిల్లా అంతటా వాన

మెట్ట పంటలకు మేలు...వరి నాట్లకు ఊతం

ప్రాజెక్టులకు చేరని వరద నీరు

చెత్తాచెదారంతో పరిసరాలన్నీ చిత్తడి మయం

అడ్డా కూలీలకు పనుల్లేని వైనం

అత్యధికంగా జహీరాబాద్ ప్రాంతంలో వర్షాపాతం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అంతటా ముసురు కమ్ముకుంది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. ఓ మోస్తరు జల్లులతో కూడిన వాన మాత్రమే పడడంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎక్కడా వరదలు ఉప్పొంగి ప్రవహించే పరిస్థితిలేదు. ముసురు వర్షపు నీరు లోతట్టు ప్రాంతంలో చేరుతుంది. ఇప్పటికే మూడు జిల్లాల్లో మెట్ట పంటలు సాగు చేసినందున దుక్కుల్లో పైర్లు పచ్చపడనున్నాయి. వరి నాట్లుకు కూడా నీటి లభ్యత పెరగనుంది. ముసురు వానతో చెత్తాచెదారం తొలగించే పరిస్థితి లేక పరిసరాలన్నీ చిత్తడి చిత్తడిగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో రోడ్లు బురదమయమయ్యాయి. పట్టణాల్లో అడ్డా కూలీలకు పనుల్లేక తిప్పలు పడుతున్నారు. ఇప్పటికే సీజనల్ వ్యాధులు ముసురుకున్నందున వీటి ప్రభావం మరింత పెరిగే అవకాశముందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలేమీ పడుతున్న పరిస్థితి లేనందున ప్రాజెక్టుల్లోకి వరద నీరు వచ్చి చేరుతున్న పరిస్థితి లేదని సింగూరు, మల్లన్నసాగర్ ఇతర ప్రాజెక్టుల నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మూడు జిల్లాలో కలెక్టర్లు మాత్రం వర్షాలు కురుస్తున్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సంగారెడ్డి, మెదక్ జిల్లాలో...

ఈ నెల శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన ముసురు వాన శనివారం కూడా పడింది. ఈ నెల 21, 22 తేదీల్లో కూడా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 22న సంగారెడ్డి, మెదక్ జిల్లాలో భారీ వర్షాలు పడే వీలుందని తెలుస్తోంది. శనివారం సంగారెడ్డి జిల్లాలో నమోదైన వర్షాపాతం వివరాలు ఇలా ఉన్నాయి. అత్యధికంగా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లిలో 28.0 మిల్లీ మీటర్లు, గుమ్మడిదలలో 27 మి.మీ, సిర్గాపూర్‌లో 25.5, ఇదే మండలంలోని కడ్పాల్‌లో 21.5, ఆరేపురంలో 22.5, జిన్నారంలో 21.5, అమీన్‌పూర్ మండంలోని సుల్తాన్‌పూర్‌లో 21.0, కిష్టారెడ్డిపేటలో 20.8, చౌటకూర్‌లో 20.0, నిజాంపేటలో 19.0, ఆందోల్ మండలంలోని అల్మాయిపేటలో 19.0, ఆరేపురంలో 19.0, కంగ్టిలో 18.8, పటాన్‌చెరులో 18.8, హత్నూరలో 18.5, పుల్కల్‌లో 17.5, జహీరాబాద్‌లో 17.3, వట్‌పల్లిలో 17.3, నారాయణఖేడ్‌లో 16.3, మనూరులో 15.3, నాగల్‌గిద్దలో 15.0, రుద్రారంలో 14.3, మల్‌చెల్మలో 14.3, కొండాపూర్‌లో 14.0, కోహీర్‌లో 14.0, దిగ్వాల్‌లో 14.0, రాయికోడ్‌లో 13.8, కందిలో 13.0, పల్వట్లలో 13.3, జహీరాబాద్‌లో 13.3, సంగారెడ్డిలో 13.3, న్యాల్‌కల్‌లో 12.8, మునిపల్లిలో 12.5, పాశమైలారంలో 10.5, కంకోల్‌లో 10.0, హత్నూరలో 9.3, సదాశివపేటలో 7.5, అన్నసాగర్‌లో 5.5 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది. మెదక్ జిల్లాలో చేగుంటలో 12.0, మెదక్‌లో 11.6, పాపన్నపేటలో 11.2, పెద్ద శంకరంపేటలో 11.0, చిన్న శంకరంపేటలో 11.1, నార్సింగ్‌లో 10.5, హవేళీఘన్‌పూర్‌లో 10.5, రామాయంపేట, రేగోడులో 8.4, అల్లాదుర్గలో 7.8, నిజాంపేటలో 9.4, టేక్మాల్‌లో 6.6, నర్సాపూర్‌లో 6.8, కొల్చారంలో 7.2, చిలిపిచేడులో 8.1, మాసాయిపేటలో 5.3, తూప్రాన్‌లో 3.3, శివంపేటలో 4.6, వెల్దుర్తిలో 8.4, కౌడిపల్లిలో 7.9, మనోహరబాద్‌లో 3.6 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 174.2 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. సగటు వర్షాపాతంగా 8.2 మి ల్లీ మీటర్ల వరకు పడింది.

మెట్ట పంటలకు మేలు

వరుసగా కురుస్తున్న ముసురు వర్షాల వల్ల మూడు జిల్లాల్లోనూ మెట్టపంటలకు ఎంతో మేలు చేశాయి. ముఖ్యంగా ఇటీవల వర్షాల్లేక సాగు చేసిన పత్తి, జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, మినుము వంటి మెట్ట పంటలు సరిగ్గా పెరగలేదు. కలుపు తీతకు కూడా తేమ లేక గుంటుకలు కూడా సాగలేదు. జులై మొదటి వారం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మెట్ట పంటలలో కలుపు తీత పనులు సాగుతున్నాయి. పైర్లకు ఎరువులు కూడా వేసుకున్నారు. డ్రై నేలలుగా ఉండడంతో పైర్లు కూడా ఏపుగా పెరగలేదు. రెండు రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పత్తి పైర్లు ఏపుగా పెరిగే అవకాశముంది. నల్లరేగడి, ఎర్ర నేలల్లో సాగు చేసిన పత్తి పైర్లకు ఈ వర్షాలు బాగా ఉపయోగపడనున్నాయి. ఇటీవలే కలుపు తీరి డీఏపీ ఎరువుల్ని చల్లి ఉన్నారు. వర్షాలు పడి భూమి పొరలు తడుస్తున్నందున మరో రెండు మూడు వారాల పాటు తేమ లభిస్తుంది. మూడు జిల్లాల్లో సాగు చేసిన 4.5 లక్షల ఎకరాల్లోని పత్తికి మేలు చేకూరనుంది. అలాగే మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము పైర్లు కూడా బాగా పెరగనున్నాయి. అదే విధంగా వరి నార్లు నాట్లు వేస్తున్నారు. బోర్లు, బావుల కింద నీటి లభ్యతను బట్టి నాట్లు వేస్తున్నారు. అయితే దుక్కులు చదును చేసేందుకు బోరు, బావుల నీరు సరిపడని పరిస్థితి వల్ల నాట్ల పనులకు ఇబ్బందులుండేవి. వర్షాల వల్ల నీటి లభ్యత పెరిగి నాట్లు వేస్తారు. అలాగే ఇటీవల వేసిన నాట్ల పైర్లు కూడా పచ్చబడి ఏపుగా పెరుగుతాయని రైతులు అభిప్రాయ పడుతున్నాయి. అయితే వర్షాలు ఇలాగే ఎక్కువ రోజులు పడితే మాత్రం లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్చి పైర్లు నీట మునిగే ప్రమాదముంది.

పరిసరాలు చిత్తడి చిత్తడి

వర్షాలు కురుస్తుండడంతో పట్టణాలు, గ్రామాల్లోనూ చెత్తచెదారం పేరుకుపోతుంది. పారిశుద్ధ్య కార్మికులు సైతం చెత్తను ఎత్తేసే పరిస్థితి లేదు. పైగా వరద నీరు డ్రైయినేజీల్లో ప్రవహిస్తుండడంతో అక్కడక్కడ జామై ఇబ్బంది ఏర్పడుతుంది. వర్షం వల్ల పరిసరాలన్నీ చిత్తడి చిత్తడిగా మారాయి. సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, జోగిపేట, నారాయణఖేడ్, నర్సాపూర్, మెదక్, రామాయంపేట, తూప్రాన్, గజ్వేల్, చేర్యాల, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ వంటి పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లోన చెత్తపేరుకుపోతుంది. పరిసరాలు పరిశుభ్రంగా ఉండకపోతే క్రిములు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదుముదని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు ఇటీవల మూడు జిల్లాల్లోనూ సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. వాతావరణంలో పెను మార్పులు వస్తున్నందున ఇవ మరింత ప్రబలే అవకాశముంది. ప్రజలు వేడి చేసిన ఆహార పదార్థాలను తీసుకోవడం, కాచి చల్లార్చిన నీరు తాగడం వంటి జాగ్రతలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ గాయత్రీదేవీ సూచించారు. పారిశుద్ధ్య పనుల్ని సైతం ఎప్పటికప్పుడు చేయించేందుకు మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు.

జలాశయాలకు చేరని వరదనీరు

సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూరు ప్రాజెక్టుకు ఏలాంటి వరద నీరు వచ్చి చేరడంలేదు. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 30 టీఎంసీలు కాగా ప్రస్తుతం 13.5 టీఎంసీలు మాత్రమే నీటి నిల్వ ఉంది. వర్షాలు కురుస్తున్నా భారీ వరదలు రావడంలేదు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు, వరదలు వస్తే తప్ప సింగూరు ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరే పరిస్థితిలేదు. అలాగే సిద్దిపేట జిల్లాల్లో ఉన్న మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ వంటి జలాశయాల్లోకి కూడా వరద నీరు రావడంలేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీ ఎత్తున వరద వచ్చి చేరితే తద్వారా సిద్దిపేట జిల్లాలో ఉన్న పలు జలాశయాలకు నీరు వచ్చే అవకాశముంది. వర్షపు నీరు వంపు ప్రాంతాలకు వెళ్తున్నందున ఆ దిగువన ఉన్న చెర్వులు, కుంటల్లోకి కొంత నీటి మట్టం పెరుగుతున్నది.

అంగన్వాడీల్లో మూడో తరగతి వరకు నిర్వహణ సరికాదు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

అంగన్వాడీలను ప్లేస్కూల్స్‌గా మార్చి మూడోతరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదన సరైంది కాదని.. ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదం డ్రులు గుర్తించటం లేదన్నారు. కాబట్టి 1,2,3 తరగతులను అంగన్‌వాడీలకు అప్పగించటం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేతకే దోహదపడుతుం దన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలనే ప్రతిపాదన ఆహ్వానించదగ్గదని..ఎంపిక చేసిన పాఠశాలల్లో తరగతికొక టీచరు, సబ్జెక్టుకొక టీచరు, ప్రధానోపాధ్యాయులు, తగినంత బోధనేతర సిబ్బంది పాఠశాలలో ఉండేలా చూడా లన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని మిగిలిన ఖాళీపోస్టులకు పదోన్నతులు చేపట్టాలని, పాఠశాలలకు స్కావెంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కంబ పురం అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్, జిల్లా కార్యదర్శి మడుపతి నరేష్ నారాయణఖేడ్ మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిసింగ్,రాజు నాయకులు ఏసు దాస్, విట్ట ల్, బస్వారాజ్ సంజీవ్ కుమార్, జావిద్ అలి, శ్రీనివాసరావు, తుకారాం, నాగ్‌నాథ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

- ఆసుపత్రిలో అన్ని టెస్టులను అందుబాటులో ఉంచాలి
- డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-సంగారెడ్డి

సమయపాలన పాటించని సదాశివపేట్ ప్రభుత్వాసుపత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని.. ఆసుపత్రిలో అన్ని టెస్టులను అందుబాటులో ఉంచాలని కోరుతూ డీవైఎ ఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరుకి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడు తూ.. సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలతో సతమతం అవుతున్నదన్నారు. వైద్యులు అందు బాటులో ఉండడం లేదని ఆరోపించారు. మధ్యాహ్నం నుంచి ఏ ఒక్క సిబ్బంది కూ డా విధుల్లో ఉండట్లేదన్నారు. నిత్యం వందల సంఖ్యలో వైద్యంకోసం వస్తున్నారని.. కానీ వారికి సరైన టెస్టులు చేయకుండా తూతూమంత్రంగా ట్యాబ్లెట్లు ఇచ్చి చేతులు దులుపు కుంటున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్‌రే, స్కానింగ్ డెంగ్యూ, మలేరియా, టైఫా యిడ్, వంటి టెస్టులను నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజ లకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. డయాగ్నటిక్ సెంటర్‌ను ఆధునికరించి అన్ని పరికరాలను అందుబాటులో ఉండే విధంగా జిల్లా వైద్య అధికారులు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు సాయి, ప్రశాంత్, ప్రభు, రాము, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వంమైన రోడ్లను నిర్మించాలి..

సదాశివపేట్ మండలం ఆత్మకూర్ నుంచి ఏటిగడ్డసంగెం మీదుగా మాలపాడ్ గ్రామం వరకు పూర్తిగా ధ్వంసమైన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ వల్లూరి క్రాంతికి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. సదాశివపేట మండలం ఆత్మకూరు నుంచి ఏటిగడ్డసంగెం మీదుగా మాలపాడు వరకు ఉన్న రోడ్డు అడుగడుగునా గుంతలతో ఇబ్బందికరంగా మారిందన్నారు. గుంతల వల్ల ఆయా గ్రామాలకు బస్సు కూడా రావట్లేద న్నారు. కాబట్టి వెంటనే ఈ రోడ్డును బాగు చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సాయి, శివ,గ్రామ యువకులు ప్రభు, ప్రశాంత్, ప్రవీణ్, రాహుల్, శ్రీకాంత్,చరణ్, నాగరాజు, మాణిక్యం, నవీన్, ప్రభాకర్, మల్లేషం, మోహన్, శ్రీకాంత్, రాజు, గణేష్, ప్రవీణ్, రామకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

115కిలోల ఎండు గంజాయి పట్టివేత



నవతెలంగాణ-మునిపల్లి

ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దు నుంచి రెండు కార్లలో అక్రమంగా తరలిస్తున్న 115 కిలోల ఎండు గంజాయిని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం పట్టుకున్నారు. ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల నుంచి మహారాష్ట్రలోని బీడ్ నుండి ఎండు గంజాయి తరలి స్తున్నట్టు పక్కా సమాచారంతో మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ఎన్‌ఫోర్స్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. అయితే మహారాష్ట్రకు చెందిన రెండు కార్లను తనిఖీచేయగా అందులో 115కిలోల ఎండు గంజాయిని గుర్తించారు. దాని విలువ రూ.42.50లక్షలు ఉంటుందని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తెలిపారు. పట్టుబడిన గంజాయితోపాటు, రూ.40 వేలు , రెండు కాం ను సీజ్‌చేసి నిందితులైన ఏక్‌సాథ్ ఖేఫర్, అజినాథ్ బిడెను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్టు వారు తెలిపారు. ఈ తనిఖీ లో సీఐలు గాంధీనాయక్, వీణారెడ్డి, చంద్ర శేఖర్, ఎస్ఐలు అనిల్‌కుమార్, యాదయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఎండి అలీం, కానిస్టేబుల్స్ అనిల్‌కుమార్, ఎం.గోపాల్, అమృత, కరీం, మల్కయ్య రామారావు నాయక్, సతీష్, మోహన్, ఉమా రాణి, కన్యశ్రీ, వివేక్, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గన్ మిస్‌ఫైర్.. సీఐఎస్ఎఫ్ జవాన్ మృతి



- బీడీఎల్ పరిశ్రమలో విషాదం

నవతెలంగాణ-పటాన్‌చెరు

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. గన్‌మిస్ ఫైర్ కావడంతో ఓ జవాన్ మృతి చెందాడు. దాంతో పరిశ్రమలో విషాద ఛాయ లు అలుముకున్నాయి. బీడీఎల్ భానూర్ సీఐ స్వామి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా అరుకు మండలం జూనుతుల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (37) సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వహిస్తూ.. ఏడాది క్రితం బీడీఎల్ పరిశ్రమకు బదిలీపై వచ్చి సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం 5:30 సమయంలో పరిశ్రమలోని వాచ్ టవర్ డ్యూటీ ముగి ంచుకొని సీఐఎస్ఎఫ్ యూనిట్ బ్యారక్‌లైన్‌లో బస్సు దిగే క్రమంలో చేతిలో ఉన్న ఎన్సాస్ రైఫిల్ మిస్ ఫైర్ అయ్యింది. గన్ లోని బుల్లెట్ నేరుగా గొంతులో నుండి తలలోకి దూసుకెళ్లి తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటినా బీడీఎల్ ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

అందరూ న్యాయపరమైన అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-మునిపల్లి

ప్రతి ఒక్కరూ న్యాయపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర సూచించారు. మండలంలోని కంకోలు వద్ద గల వోక్సన్ యూనివర్సిటీలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. ప్రతి ఒక్కరూ చట్టం న్యాయపరం అంశాలను కలిగి ఉండాల్సిన అవశ్యకతను వివరించారు. కార్మికులకు, విద్యార్థులకు పోక్సో, కుటుంబ తగాదాలు, వరకట్న నిషేధం వంటి చట్టాలు, అనేక అంశా లపై న్యాయపరమైన సలహాలు ఇచ్చారు. ప్రతీ ఒక్కరు న్యాయపరమైన అవగాహన కలిగి ఉండడం ద్వారా చట్టం, న్యాయం అనే విషయాలను సమాజం వరకు తీసుకెళ్లగలుగు తామ న్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంజీవ రావు, జిల్లా మహిళా సంక్షేమ అధికారి లలిత కుమారి, వోక్స న్ యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ శ్రీలత, సీడబ్ల్యూసిఎం మెంబర్ విష్ణుమూర్తి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గీతం 15వ పట్టభద్రుల దినోత్సవం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న బార్క్లేస్ బ్యాంక్ పూర్వ సీఈవో రామ్ గోపాల్
- 1,325 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం
- అత్యుత్తమ ప్రతిభ చాటిన 23 మందికి బంగారు పతకాలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శనివారం 15వ పట్టభద్రుల దినోత్సవం (స్నాతకోత్సవం) వైభవంగా నిర్వహించారు. గీతం ఇన్చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ వె.గౌతమ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బార్క్లేస్ బ్యాంక్ ఇండియా పూర్వ సీఈవో రామ్ గోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాల యం నుంచి 2023-24 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, మేనేజ్మెంట్, సైన్స్, ఫార్మసీ, హ్యూమానిటీస్, ఆర్కిటెక్చర్ కోర్సులు పూర్తి చేసిన 1,490 మంది పట్టాలు పొందడానికి అర్హత సాధించారు. కాగా ప్రత్యక్షంగా 1,325 మంది, పరోక్షంగా (ఇన్ ఆబ్సెన్షియా) 69 మంది పట్టభద్రులకు డిగ్రీలను, 23 మంది ప్రతిభావంతులకు బంగారు పతకాలను అందజేశారు. బీటెక్ 708, ఎంటెక్ 13, బీఎస్సీ 103, ఎమ్మెస్సీ 72, ఎంఏ- బీఏలో 67, ఎంబీఏ 93, బీబీఏ 149, బీకాం 22, బీ. ఫార్మసీ-ఎం.ఫార్మసీ 27, బీ. ఆర్కిటెక్చర్ 24, పిహెచ్ డి లో 24 మంద పట్టభద్రులయ్యారు. ఈసీఈ విభాగంతో పాటు బీటెక్ టాపర్‌గా నిలిచిన కె. కీర్తికి గీతం అధ్యక్షుడి పేరిట నెలకొల్పిన రెండు బంగారు పతకాలను అందుకోగా, పీజీ బెస్ట్ ఆల్ రౌండర్‌గా ఎంబీఏ విద్యార్థి శివకుమార్ శివాంజలి, యూజీ బెస్ట్ ఆల్ రౌండర్‌గా బీఎస్సీ విద్యార్థిని వర్ష మెథైలి నిమ్మకాయల బంగారు పతకాలను అందుకున్నారు. పచ్చటి ప్రకృతి మధ్య సుందర ప్రాంగణంలో నెలకొని ఉన్న గీతం ప్రాంగణానికి వెళ్లే దారులన్నీ బ్యానర్లతో అలంకరించారు. అందంగా తీర్చిదిద్దిన రంగవల్లులు, పూల అలంకణలు వీనుల విందు చేశాయి. పట్టాలను అందు కోవడానికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఆవరణలో సందడి నెలకొంది. పట్టభద్రులంతా తెల్లని దుస్తులు, ఎర్రని కండువాలతో వచ్చి భారతీయతను వ్యక్తపరిచారు. బంగారు పతక విజేతలు, పట్టభద్రులు పలువురు గీతమ్ తో తమకున్న అనుబంధం, అక్కడ ఎదిగిన తీరు, విద్యనభ్యసించేటప్పటి పలు మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. మొత్తంగా పండుగ వాతావరణంలో గీతం 15వ పట్టభద్రుల దినోత్సవం విజయవంతంగా ముగిసింది.

తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

- పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి
- టీఎస్ఎస్ కళాకారులకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- కళాకారులకు వాహన సౌకర్యం కల్పించాలి
- ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు అంజనేయులు



నవ తెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో తమ ఆట పాట ద్వారా కృషి చేసిన సాంస్కృతిక సారధి కళాకారుల సమస్యలను పరిష్కరించాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. అంజనేయులు, ఏ.నాగభూషణంలు డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాంస్కృతిక సారధి కళాకారులను గత ప్రభుత్వం వాడుకొని వదిలేసిందని, ఈ ప్రభుత్వమైనా కళాకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ తమ ఆటపాట ద్వారా వివరిస్తున్న కళాకారులు గత నాలుగు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాంస్కృతి సారధి కళాకారులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతినెల వేతనాలు రెగ్యులర్‌గా ఇవ్వాలని, గ్రామాల్లో ప్రచారానికి వెళ్లే సందర్భంగా వారికి వాహన సౌకర్యం కల్పించాలని కోరారు. కళాకారులకు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కూడా కల్పించాలని కోరారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసేందుకు ఉపయోగపడేలా వారికి మైకు సౌకర్యం కూడా లేకపోవడంతో, వారు గొంతుతో ప్రచారం చేస్తూ ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే మైకు సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
2
ఆదివారం | 21 జులై 2024 | www.navatelangana.com

అధికారుల పనితీరుపై డీపీఓ ఆగ్రహం



నవతెలంగాణ-ఝరాసంగం

మురుగు కాలువల నిర్వహణ, మంచినీటి సరఫరా, పారిశుధ్యంపై నిర్లక్ష్యం వంటి పనులపై గ్రామాల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాలలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. అంతేకాకుండా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ప్రత్యేకంగా పారిశుద్ధంపై నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-జహీరాబాద్

అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జహీరా బాద్ ఎమ్మెల్యే మాణిక్ రావును మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. సోమాజిగూడ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యేను బెవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ దేవీప్రసాద్‌తో కలిసి హరీశ్‌రావు శనివారం పరామర్శించారు. అనంతరం డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబసభ్యులతో మాట్లాడి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సమయంలో మాణిక్‌రావు కుటుంబ సభ్యులు మిథున్ రాజ్, రాజు తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన విద్యార్థి నాయకుడు క్రాంతి



నవతెలంగాణ-రామచంద్రాపురం

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పటాన్చెరు నియోజకవర్గానికి చెందిన సర్కిల్ విద్యార్థి విభాగం అధ్యక్షులు క్రాంతి శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఖండిస్తూ, విద్యార్థులకు, ప్రజలకు సేవ చేస్తూ బీఆర్ఎస్‌ను బలోపేతం చేసే విధంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పినట్టు క్రాంతి తెలిపారు.

జయరాజును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-జోగిపేట

గుండెపోటుతో హైదరాబాదులోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రజాకవి జయరాజును అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ శనివారం పరామర్శించారు. ఆరోగ్య విషయాల గురించి సంబంధిత డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆరోగ్యం కుదుటపడాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

త్వరలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులు ప్రారంభం



నవతెలంగాణ-రామచంద్రాపురం

పాత రామచంద్రాపురం పరిధిలో ఉన్న 1, 2వ బ్లాక్‌లో నూతనంగా మంజూరైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు రెండ్రోజుల్లో ప్రారంభం కానున్నాయని కార్పొరేటర్ పుష్ప తెలిపారు. శనివారం స్థానిక నాయకులు, జలమండలి మేనేజర్ జనార్దన్‌లతో కలిసి పాత రామచంద్రాపురంలో కార్పొరేటర్ పర్యటించారు. ఎన్నో ఏండ్ల తర్వాత డ్రైనేజీ సమస్య పరిష్కారం అవుతున్న సందర్భంగా కార్పొరేటర్‌ను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకట లక్ష్మారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, అశోక్ రెడ్డి, సంజీవ రెడ్డి, అప్పల భాస్కర్, ప్రభాకర్, సీఎం మల్లేష్, అరుణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండలంలో ప్రజావాణి కార్యక్రమం

నవతెలంగాణ-పుల్కల్

కలెక్టర్ ఆదేశాలతో ఇకనుంచి ప్రతీ సోమవారం ఉదయం 10:30 నుంచి ఎంపీడీఓ కార్యాలయంలోనే కాకుండా తహసీల్దార్ కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు పుల్కల్ ఎంపీడీవో ఆనంద్ మేరీ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తుల పరిష్కారం కోసం సంబంధిత పై అధికారులకు పంపించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏ ఒక్క అధికారి తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ తిరిగి బాధితుడికి అప్పగింత



నవతెలంగాణ-కంది

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితుడికి ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ విజయ్ కుమార్ శనివారం తిరిగి ఆ ఫోన్‌ను అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. శంకర్‌పల్లి మండలం సింగపూర్ టవర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనుకోకుండా ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అయితే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆ ఫోన్‌ను గుర్తించి.. ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి తిరిగి ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విలువైన ఫోన్స్ పట్ల అజాగ్రత్తగా ఉండొద్దన్నారు. ఒకవేళ ఎవరైనా ఫోన్లను పోగొట్టుకుంటే.. వెంటనే మీ సేవా కేంద్రంలో నమోదు చేసి.. ఆ దరఖాస్తును సంబంధిత పోలీస్ స్టేషన్లో ఇవ్వాలన్నారు.

ప్రజలు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వాన ముసురు వల్ల ప్రజలు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఏఈ అర్జున్ సూచించారు. పొలాల వద్ద, ఇంటి వద్ద విద్యుత్‌కు సంబంధించిన పరికరాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. తెగిపోయిన వైర్లను ముట్టుకోవద్దు అన్నారు.

ఉపాధ్యాయులతో తల్లిదండ్రుల సమావేశం



నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పిల్లలను స్కూల్‌కి పంపిచాలన్నారు. విద్యార్థులను ఉన్నత చదువులు చదివించి.. వారి భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంటుందన్నారు. బాల్య వివాహాలు చేయొద్దని తల్లిదండ్రులకు తెలిపారు. అనంతరం పార్కల మంజుల రాంరెడ్డి జన్మదినం సందర్భంగా పీఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలకు షూస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాజీ సీడీసీ చైర్మెన్ సుభాష్‌రెడ్డి, పార్కల రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మొగులయ్య, రాములు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రుణమాఫీ అయిన రైతులు బ్యాంకును సంప్రదించాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

రుణమాఫీ అయిన రైతులు భూమి వివరాలు, పహాని, వన్ బి, ఈసి పత్రాలు తీసుకొచ్చి బ్యాంకు అధికారులనుసంప్రదించాలని కొత్తూరు(బి) కెనరా బ్యాంకు మేనేజర్ తుల్జారాం తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 1041 మంది రైతులకు సంబంధించి రూ.7.22కోట్ల రుణాలను మాఫీ చేసినట్టు తెలిపారు. బ్యాంకు ఎదుట లిస్ట్ కూడా అతికించినట్టు చెప్పారు. బ్యాంక్‌లో రద్దీని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో బీసీ పాయింట్లలో డబ్బు లు తీసుకోవాలని సూచించారు. రైతులు మళ్లీ తిరిగి క్రాప్‌లో న్లు పొందేందుకు బ్యాంకు అధికారులను సంప్రదించి వివరాలు తెల్సుకోవా లన్నారు. తమ బ్యాంకులో ఖాతాలు ఉన్న రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కనీస సౌకర్యాలు కరువు



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకుండా పోయాయని ఎస్ఎఫ్ఐ ఏరియా జహీరాబాద్ కార్యదర్శి విష్ణువర్ధన్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలను శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి వాటిని బాగు చేయించలేదన్నారు. దాంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని పాఠశాలల్లో కనీసం టాయిలెట్స్ లేవని, కొన్ని శుభ్రంగా లేవని, గది గోడలు, పై కప్పులు శిథిలం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే సదరు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్ , భరత్ , కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మోకాల్లోతు గుంతలు..
అరచేతిలో ప్రాణాలు



- జహీరాబాద్ నియోజకవర్గంలో పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు
- నానా అవస్థలు పడుతున్న ప్రజలు
- పదేండ్ల క్రితం వేసిన రోడ్లే నేటికీ దిక్కు

> జహీరాబాద్ నియోజకవర్గంలోని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి రోడ్లు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారా యి. చిన్న చిన్న గుంతలను పూడ్చకపోవడంతో అవి నేడు మోకాల్లోతు గుంతలుగా మారడంతో.. ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొన్నది. గత మూడ్రోజులుగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుం దడంతో.. గుంతలన్నీ నీటితో నిండి చెరువులను తలపిస్తు న్నాయి. దాంతో ఈ రోడ్డు గుండా ప్రయాణాలు చేయాలంటే జనాలు జంకుతున్నారు. ఒకవేళ సాహసం చేసి వచ్చినా.. ఏదో ఓ గుంతలో వాహనాలు కూరుకుపోతున్నాయి.

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నుంచి మల్చల్మ, శాఖాపూర్ వెళ్లే రోడ్డు, ఖాసీంపూర్, జహీరాబాద్ నుంచి గాంధీనగర్, చిన్న హైదరాబాద్, హెుటి కే కొత్తూర్, బూచినెల్లి, బుర్దిపాడు, చిరాక్‌పల్లి, సత్వార్ బోనమ్మపల్లె, మొగుడంపల్లి, జహీరాబాద్ నుంచి ఝరాసంగం, కోహీర్, హుగ్గెల్లి నుంచి కోహీర్, మదిరి కోహీర్, రాయిపల్లి డి, హగ్నూర్ నుంచి న్యాలకల్, జహీరాబాద్ నుంచి అల్గోల్, అల్గోల్ నుంచి పొట్పల్లి, ఎలుగోయి వెళ్లే రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉన్నది. రాష్ట్రం ఏర్పడిన అనంతరం మండల కేంద్రాలకు డబుల్ రోడ్లు వేశారు. అనంతరం ఆ రోడ్డుపై ఏర్పడిన చిన్న చిన్న గుంతలను కూడా పట్టించుకోలేదు. దాంతో అవి నేడు మోకాల్లోతు గుంతలుగా మారి.. ప్రమాదాలకు కారణమవు తున్నాయి. ఆ గుంతల్లో వాహనాలు అందులో పడుతు ఒడడంతో.. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ఇంత జరుగుతున్నా.. ఈ రోడ్ల మరమ్మ తులకు పాలకులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవ ట్లేదు. దాంతో వర్షాలు పడ్డప్పుడు రోడ్లపై నీళ్లు ప్రవహిం చడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోతాదుకు మించిన బరువుతో వాహనాలు వెళ్తుండడంతో రోడ్లు ఎక్కడికక్కడ ధ్వంసమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హాయంలో రోడ్ల మరమ్మతులకు, కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ.. పనులు చేపడు తున్న కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించకపోవడంతో పనులన్నీ అర్థాంతరంగానే నిలిచిపోయాయి. పలు పనులకు టెండర్లు పిలవగా ఏ ఒక్కరు కూడా ముందుకు రాకపోవడంతో నిధు లన్నీ తిరిగిపోయాయని అధికారులు చెబుతున్నారు. అల్లిప ూర్ నుంచి కొత్తూరు వెళ్లే బైపాస్ రోడ్డుపై మోకాల్లోతు గుంతలు పడడంతో బీదర్ నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే వాహన దారులు తరచూ రోడ్డు ప్రమాదాలకు గురి కావాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇటీవలే లెజెండ్ వాల్యూ వద్ద గుంతల వల్ల లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. దాంతో స్తంభాలు విరిగిపోయాయి. ప్రమాదాలు సంభవించినప్పు డు వివిధ శాఖల అధికారులు ఘటనా స్థలాలకు వెళ్లి నివేదిక లను తయారు చేస్తున్నారే తప్పా.. ఎక్కడ కూడా వాటిని అమలుపరుస్తున్న దాఖలాలు కనిపించడం లేదని పలువురు మండిపడుతున్నారు. మహేంద్ర స్టార్ సిటీ వద్ద బీదర్ బైపా స్ రోడ్డుపై పడిన గుంతలతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు.



బైపాస్ సర్వీస్ రోడ్డు అంటే జంకుతున జనం..

జహీరాబాద్ పట్టణంలోని జాతీయ రహదారి 65 రైల్వేలైన్‌పై ఏర్పాటు చేసిన ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు ఏడాది నుంచి సాగుతున్నాయి. అయితే పనులు కొనసాగుతుండడంతో ప్రయాణికులకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డుపై గుంతలను కూడా కనీసం పూడ్చకపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. మహేంద్ర పరిశ్రమకు వెళ్ళే కార్మికులు నిత్యం నరకం చూస్తున్నారు. అంతేకాకుండా తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్డుపై ఏర్పడిన మోకాల్లోతు గుంతలను పూడ్చకపోవడంతో.. చివరికి బస్సులు సైతం గుంతల్లో ఇరుక్కుపోతున్నాయని స్థానికులు చెబుతు న్నారు. ఇటీవలే ఓ కారు గుంతల్లో ఇరుక్కుపోవడంతో.. కారులో ఉన్న వారిని అతికష్టం మీద బయటికి తీసినట్టు తెలిపారు. కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సర్వీస్ రోడ్డుపై ఉన్న సమస్యలు పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. దెబ్బతిన్న రోడ్లన్నింటినీ బాగు చేయాలని కోరారు.

నిధులొస్తేనే మరమ్మతులు..

- నర్సింలు, ఆర్అండ్‌బి అధికారి

రోడ్లను వేసిన కాంట్రాక్టర్ గిస్పేట్ పూర్తవడంతో మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తేనే గుంతలు పూడ్చడం జరుగుతుంది. రైల్వే ఓవర్ బ్రిడ్జి కాంట్రాక్టర్‌కు నిధులు రానందున పనులు నిలిపివేశారు.

రౌడీలు, సస్పెక్ట్‌లు సత్:ప్రవర్తన కలిగి ఉండాలి

- అలా అయితే హిస్టరీ షీట్ క్లోస్..
- ఎస్పీ చెన్నూరి రూపేష్
- జహీరాబాద్ సబ్-డివిజన్ పరిధిలో ఉన్న సుమారు 200 మంది హిస్టరీ షీటర్లకు కౌన్సిలింగ్..



నవతెలంగాణ-జహీరాబాద్

జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీలు, కేడిలు మరియు సస్పెక్ట్‌లు సత్:ప్రవర్తన కలిగి ఉండాలని.. అలా అయితే వారి హిస్టరీ షీట్ క్లోస్ చేస్తామని జిల్లా ఎస్పీ రూపేష్ అన్నారు. రౌడీలు, కేడీలు, సస్పెక్ట్‌లను చెక్ చేయడానికి గత వారం రోజులుగా సబ్-డివిజన్ల వారీగా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం జహీరాబాద్ సబ్-డివిజన్ పరిధిలో ఉన్న హిస్టరీ షీటర్లకు జహీరాబాద్‌లోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో కౌన్సిలింగ్, చెక్కింగ్ కార్యక్రమాన్ని డీఎస్పీ రామ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూ.. రౌడీలు, కేడిలు మరియు సస్పెక్ట్‌లు సత్: ప్రవర్తన కలిగి ఉండాలని, సత్:ప్రవర్తనా కలిగి ఉన్నట్లైతే హిస్టరీ షీట్ క్లోస్ చేయడం జరుగుతుందన్నారు. ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా జిల్లాలో కులమతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి, అల్లర్లు సృష్టించే కమ్యూనల్ అఫెండర్స్, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసుల్లో యాక్టివ్‌గా ఉన్న నేరస్తుల హిస్టరీ షీట్ ఓపెన్ చేయడానికి ప్రపోసల్ పంపాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచనలు చేశారు. జిల్లాలో గంజాయి పండిచినా, అక్రమ రవాణా చేసినా, విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. నూతన చట్టాలైన బీఎస్ఎస్ ప్రకారం కఠిన చర్యలున్నాయని.. ఇద్దరు ముగ్గురు కలిసి నేరం చేస్తే ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడమే లక్ష్యంగా జిల్లాలో వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. జిల్లాలో మాదకద్రవ్యాల ఆనవాళ్ళు ఉన్నట్టు గుర్తిస్తే.. ఎస్ఎన్‌బీ నెంబర్ 8712656777కు సమాచారం అందించాలని జిల్లా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్ మోహన్‌రెడ్డి, జహీరాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రవి, జహీరాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ నయిమొద్దీన్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, సబ్-డివిజన్ ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షాల దృష్ట్యా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ప్రజలు అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయండి
- అత్యవసర సమయంలో డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712656739ను సంప్రదించాలి
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్రంలో రెండ్రోజులుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని.. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేశారని కాబట్టి జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రూపేష్ సూచించారు. జిల్లా ప్రజలు కూడా అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలాశయాలు నిండుకుండాల మారే అవకాశం ఉన్నందున.. చెరువులు, కుంటలను చూడటానికి ఎవ్వరూ వెళ్లొద్దన్నారు. ఏదైనా ప్రమాదం తలెత్తినా, అత్యవసర సమయంలో స్థానిక పోలీసు స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656739ను సంప్రదించాలన్నారు. జిల్లా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు కుంటలకు వెళ్ళకుండా ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేసేవిధంగా చూడాలన్నారు. ఎస్‌హెచ్‌ఓలు ప్రత్యేకంగా తమ తమ ఏరియాలో ఉన్న చెరువులు కుంటలను సందర్శించి, ఆనకట్టలు ప్రమాద అంచున ఉంటే సమాచారం అందించాలని సూచించారు. భారీ వర్షాల దృష్ట్యా పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలన్నారు. విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ చేతులతో తాకొద్దన్నారు. నీరు నిలువ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర నుంచి వెళ్లొద్దన్నారు. వాగులు, వంకలు బ్రిడ్జిలపై నుంచి పొంగి, ప్రవహించే సమయంలో దాటాడానికి ప్రయత్నించొద్దన్నారు. పాడైన పాత భవనాల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల ప్రక్కన నివాసం ఉండొద్దని సూచించారు.

'ఇంటింటా ఇన్నోవేటర్'పై ప్రత్యేక దృష్టి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతీ ఒక్కరికీ చేరువ చేసేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని మరుగున పడేసిందని.. కానీ నేడు మంత్రి శ్రీధర్ బాబు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకు సాగుతున్నారన్నారు. నియోజకవర్గంలో ఐటిఐ కాలేజ్‌తో పాటు అందులోనే ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ కోర్స్ కావాలని మంత్రిని తాను అడిగినట్టు చెప్పారు. అందుకు మంత్రి కూడా సానుకూలంగా స్పందించారన్నారు. ఇన్నోవేషన్స్‌ని గుర్తించడమే కాకుండా ఇంట్రెస్ట్ ఉన్న యువతీ యువకులకు వాటిని ప్రోత్సహించే విధంగా లోన్లు కానీ, సపోర్ట్ కానీ అందించే విధంగా చూడాలని అధికారులను కోరారు. తనవంతు ఏ సాయం కావాలన్నా చేస్తానన్నారు. అనంతరం ఇంటింటా ఇన్నోవేటర్ 2024 పోస్టర్ ఆవిష్కరించారు. నియోజకవర్గనికి చెందిన పరిశోధక యువకులను సన్మానించారు. వారితో సమావేశం ఏర్పాటు చేసి.. వారి పరిశోధన వివరాలు.. వాటికి కావాల్సిన సాయంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షేట్కార్, వైస్ చైర్మెన్ శంకర్ సెట్, టీఎస్ఐసీ జిల్లా ఇంచార్జ్ సాయి శ్రీజ, మండల నాయకులు రమేష్ చౌహన్, దీపక్ రెడ్డి, పండరీరెడ్డి పాల్గొన్నారు.

కాలుష్య పీడిత గ్రామాలకు నీటి సరఫరా పెంచండి



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని కాలుష్య పీడిత ప్రాంతాలైన కాజిపల్లి, గడ్డపోతారం, కిష్టయ్యపల్లి, అలీనగర్‌తో పాటుగా గండిగూడెం గ్రామాలకు మంచినీటి సరఫరా వసతిని పెంచాలని, ప్రత్యేకంగా ఓ పంపుహౌస్ నిర్మించాలని కాజిపల్లి జేఏసీ కమిటీ దండే రమాకాంత్ బృందం, స్థానిక నాయకులు, యువకులు సంబంధిత అధికారులతో శనివారం చర్చలు జరిపారు. కాజిపల్లిలో వివిధ సమస్యలపై శనివారం నిర్వహించ తలపెట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు ముఖ్యఅతిథిగా కార్యక్రమాన్ని ఖరారు చేసినా.. వర్షం నేపథ్యంలో ఎంపీ పర్యటన వాయిదా పడింది. కాగా మరో వారం పది రోజుల్లో ఎంపీతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు. ఈ నేపథ్యంలో ఖాజీపల్లి గ్రామ పంచాయతీలో మిషన్‌భగీరథ నీటి సరఫరాపై సంబంధిత అధికారులు, గ్రామస్తులు, జేఏసీ దండే రమాకాంత్ బృందం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఖాజీపల్లి గ్రామంలో భూగర్భ జలాలు కాలుష్యమయంగా మారాయని ప్రస్తుతం గ్రామానికి సరఫరా అవుతున్న దానికంటే రోజుకు ఒక వ్యక్తికి రెండు వందల లీటర్ల నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి గత ఆరు నెలలుగా గ్రామానికి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీటి వివరాలను అధికారులకు వివరించారు. మండలంలో తమ గ్రామం చివరగా ఉండడంతో రావాల్సిన నీటి కంటే తక్కువగా వస్తున్నాయని గ్రామస్తులు అధికారుల ఎదుట సమస్యను ప్రస్తావించారు. గ్రామంలో మంజీరా నీటితోపాటు మిషన్ భగీరథ నీటిని కూడా సరఫరా చేయాలని, గ్రామ శివారులోనే రిజర్వాయం ను ప్రత్యేకంగా నిర్మించాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. కాలుష్యం వల్ల స్థానిక జనాలకు మోకాళ్ళ నొప్పులు ఇతరత్రా ఆరోగ్యపరమైన సమస్యలు తీవ్రంగా ఎదుర్కోవాల్సి వస్తుందని సమావేశంలో పాల్గొన్న వైద్యాధికారుల దృష్టికి సమస్యను వారు నివేదించారు. గ్రామస్తులు చెప్పిన సమ్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజిపల్లి గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ అధికారులు శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, రాజకుమార్, ధరణి, మెడికల్ ఆఫీసర్ భవాని, జేఏసీ చైర్మన్ దండే రామాకాంత్, గ్రామస్తులు, యువజనులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



నవతెలంగాణ-అమీన్‌పూర్

ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా వర్షాలు పట్ల అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండు రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ స్టాఫ్ మరియు హెల్త్ సిబ్బందితో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అపార్ట్మెంట్ల సెల్లార్లలో నీరు నిల్వ ఉండకుండా సంపులు ఏర్పాటు చేసుకుని.. నీటిని వెంట వెంటనే బయటికి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్యానెల్ బోర్డులను వర్షాలకు తడవకుండా ఫస్ట్ ఫ్లోర్లో ఏర్పాటు చేసుకోవాలని.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్స్ జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి మాట్లాడుతూ.. శిథిలావస్థితిలో ఉన్న పాత ఇళ్ళను వెంటనే గుర్తించాలని, ఆ గుర్తించిన వాటికి నోటీసులు జారీ చేసి వెంటనే కూల్చివేయాలన్నారు. లో లైన్ ఏరియాలను గుర్తించి వర్షపు నీరు నిల్వ లేకుండా తగు చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. మ్యాన్ హెూల్స్ ఓపెన్‌లో లేకుండా, ఏమైనా రిపేర్లు ఉంటే వెంటనే సైన్‌బోర్డ్స్ ఏర్పాటు చేసి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాల కారణంగా ముందస్తుగా జేసిబి, ట్రీ కటింగ్ ఎక్విప్మెంట్స్‌ను అందుబాటులో ఉండే విధంగా ఏరాపటు చేస్తున్నామన్నారు. మెడికల్ ఆఫీసర్ రాధిక మాట్లాడుతూ.. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు దోమల వ్యాప్తి చెందకుండా పరిసరాల పరిశుభ్రత చాలా అవసరమన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అమీన్పూర్ సిఐ సదా నాగ రాజు మాట్లాడుతూ.. వర్షాల కారణంగా వాటర్ ఫ్లో వలన ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే.. సిబ్బందిని పంపించడం లేదా తాము పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌టౌన్ ప్లానింగ్ అధికారి పవన్, ఆర్వో వెంకటరామయ్య, సానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజన్ కుమార్, మున్సిపల్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ చైర్మెన్‌కు సన్మానం



నవతెలంగాణ-కొండాపూర్

సంగారెడ్డి నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మెన్ వై.ప్రభు మొదటిసారి కొండాపూర్ తహసీల్దార్ కార్యాల యానికి శనివారం రాగా.. ఆయన్ను ఉప తహసీల్దార్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, మండల గిర్దవారి.. మల్లంరాజు, మహాదేవ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలి



నవతెలంగాణ-జోగిపేట

ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలని ముదిరాజ్ సంఘం ఇంచార్జ్ డిబి. నాగభూషణం అన్నారు. ఈ మేరకు శనివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ భాస్కర్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలనిడిమాండ్ చేశారు. మత్స్యకారుల అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించి, 75శాతం సబ్సిడీతో సంక్షేమ పథ కాలు అమలు చేసి తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయా లన్నారు. తెలంగాణ మత్స్య కో-ఆపరేటివ్ ఫెడరేషన్‌కు వెంటనే ఎన్నికలు జరిపి చైర్మెన్, పాలకమండని నియమించాలన్నారు. ముదిరాజులకు ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. మంత్రివర్గంలో ముదిరాజులకు ప్రత్యేక స్థా నం కల్పించాలన్నారు. 10శాతం కార్పొరేషన్లలో ముదిరాజులకు స్థానం కల్పిం చాలని కోరారు. ఆయనతో పాటు ముదిరాజ్ సంఘం నాయకులు చాపల వెంక టేశం, అరిగే వెంకటేశం, సాయిబాబా, ప్రకాష్, దానయ్య, చంద్రయ్య, కృష్ణపాల్గొన్నారు.

పాఠశాలకు ట్యూబ్‌లైట్స్, ఫ్యాన్స్ వితరణ



నవతెలంగాణ-ఝరాసంగం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యూబ్ లైట్స్, ఫ్యాన్స్ సామాగ్రిని శనివారం పంపిణీ చేశారు. సామాజిక బాధ్యతగా తమ వంతు కృషి చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రావణ్,నాగేశ్వర్ రెడ్డి,మనోజ్, రవితేజా,సందీప్, బ్యాంక్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్
ఆదివారం | 21 జులై 2024 | www.navatelangana.com

రైతు బీమాలో సవరణలకు సదవకాశం

- మండల వ్యవసాయాధికారి స్వేతాకుమారి



నవతెలంగాణ-కొల్చారం

కొల్చారం మండలంలోని అర్హులైన రైతులు 2024కు సంబంధించిన రైతు బీమాలో సవరణలు చేసుకునేందుకు సదవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి శ్వేతాకుమారి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. రైతు బీమాలో ఏమైనా తప్పులు ఉంటే సవరణలు చేసుకునేందుకు, అలాగే నామిని పేరు మార్చుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. అందుకోసం వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా కొత్త పాస్‌బుక్ పొందిన రైతులు రైతు బీమా కోసం ఆగస్టు 5 లోపు తమ పట్టా పాస్ బుక్, ఆదార్ కార్డు, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్స్ కాఫీలను సమీప వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని మండలంలోని అర్హులైన రైతులు సకాలంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంట పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



నవతెలంగాణ-పెద్దశంకరంపేట్

పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మూసాపేట గ్రామ శివారులో పత్తి, వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి పంటలపై యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు గ్రామంలో పలువురి రైతులతో మాట్లాడి రుణ మాఫీపై వారి వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. పేటలోని పలు బ్యాంకులు సందర్శించి రుణమాఫీపై రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి సుభాష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులోకి ప్రజా పాలన సేవా కేంద్రం

- ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలిఘనాపూర్

ప్రజలకు ప్రజాపాలన సేవా కేంద్రం అందుబాటులోకి తేవడం జరిగిందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం మెదక్ కలెక్టరేట్‌లోని ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రజా పాలన సేవా కేంద్రంలో ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారెంటీ పథకాలకు సంబంధించి గతంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల లోటుపాట్లు సవరించుకోవచ్చని చెప్పారు. నూతనంగా ప్రారంభించిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆన్లైన్‌లో వివరాలు నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఈ డిస్టిక్ మేనేజర్ సందీప్, సంబంధిత పంచాయతీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణమాఫీపై వాడిలో సంబరాలు

- కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-హవెలిఘనపూర్

రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు లక్ష్మారెడ్డి అన్నారు శనివారం మండల పరిధిలోని వాడి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతని, బడుగు బలహీన వర్గాల పార్టీ అన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఎన్నో విధాలుగా సేవలు అందించిందని, సీఎం రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేందర్ రెడ్డి, సాయిలు మాజీ ఎంపిటిసి, ప్రభాకర్, మల్లారెడ్డి, సాయి రెడ్డి, మాధవరెడ్డి, శ్రీశైలం, సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.

దేవాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

- నవతెలంగాణ-మద్దూరు



మద్దూరు మండలంలో వరుస దొంగతనాలు అనే శీర్షికను ఈ నెల 19న నవతెలంగాణ పత్రికలో ప్రచురించడంతో స్పందించిన పోలీసులు ప్రత్యేకంగా పెట్రోలింగ్ నిర్వహించారు. అదే విధంగా దూల్మిట్ట మండలంలోని బైరాన్ పల్లిలోని దుర్గమ్మ ఆలయంలో, మద్దూరు మండలంలోని రేబర్తి పెద్దమ్మ ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జియో ట్యాగ్ చేశారు. సీసీ కెమెరాలు పెట్టించడంతోపాటు ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకోవాలని భక్తులు కోరుతున్నారు. ప్రత్యేక కథనం రాసిన 'నవ తెలంగాణ పత్రికకు ప్రజలు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు .

ప్రజా సంక్షేమం కోసం 6 నెలల్లో రూ.60 వేల కోట్లు

- గజ్వేల్ ప్రజ్ఞాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు నక్క రాములు గౌడ్



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రజా సంక్షేమం కోసం రూ.60 వేల కోట్లు ఖర్చు చేయడం జరిగిందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు నక్క రాములు గౌడ్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షులు తూముకుంట నర్సిరెడ్డి నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న కాంగ్రెస్ పార్టీపై ప్రతిపక్షాలు విమర్శించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీలో పది లక్షల రూపాయల పెంచడం జరిగిందన్నారు. దమ్ముంటే రాజీనామా చేస్తా అన్న సవాళ్లు నిలబెట్టుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల కేంద్రంలో శనివారం ఆషాడ మాసం సందర్భంగా మున్నూరు కాపు సంఘం వారి ఆధ్వర్యంలో పోచమ్మకు డప్పు చప్పుల మధ్య దూపదీప, నైవేద్యాలతో పోచమ్మ వారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆషాడ మాసంలో పోచమ్మ వారికి ధూపదీప, నైవేద్యాలతో బోనాలు సమర్పిస్తామని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు తాడెం శ్రీశైలం, కోశాధికారి తాడెం తిరుపతి, మున్నూరు కాపు సభ్యులు నాయినిలక్ష్మణ్, నాయిని వెంకటేశం, మల్లేశం, పెద్ద మల్లేశం, బాల రాజు, మహేష్, తాడెం బాను, నాయిని ప్రసాద్, సిద్ధ రాములు, పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు



నవతెలంగాణ-నిజాంపేట

మండలంలోని రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులను జమ చేయడం ప్రారంభమైంది. ఈ క్రమంలో రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని మండల వ్యవసాయ ఇన్చార్జి అధికారి రాజ్ నారాయణ తెలిపారు. 12-12-2018 నుంచి 09-12-2023 వరకు పంట రుణాలు తీసుకున్న రైతులు అందరూ అర్హులని తెలిపారు. కుటుంబానికి రెండు లక్షల చొప్పున రుణమాఫీ జరుగుతుందన్నారు. ఈ క్రమంలో మొదటి విడతగా లక్షలోపు పంట రుణాలు కలిగిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. అర్హత కలిగి న రైతులు తమ సందేహాలు తీర్చుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

హిందీ పండిత్ లేక ఇబ్బంది

- మండలంలోని పలు పాఠశాలల్లో హిందీ పండిత్‌ల కొరత
- విద్యార్థులు హిందీ నేర్చుకునేది ఎట్లా?
- వెంటనే హిందీ పండిత్‌లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్



నవతెలంగాణ-నిజాంపేట

భారత జాతీయ భాష హిందీ. భారతదేశంలో ఏ ప్రాంతంలో తిరగాలన్న హిందీ భాష తప్పకుండా రావాలి. భారత ప్రభుత్వం హిందీని జాతీయ భాషగా ప్రకటించిందని, అటువంటి భాషా పండితులు మండలంలోని పాఠశాలల్లో లేకపోవడం విద్యార్థులకు ఎంతో నష్టం వాటిల్లుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. నిజాంపేట జిల్లా పరిషత్ హై స్కూల్‌లో హిందీ పండిత్‌లు లేకపోవడం చాలా బాధాకరం. నిజాంపేటనే కాకుండా మండలంలోని చల్మెడ ఇతర గ్రామాలలో కూడా హిందీ పండిత్‌లు లేరని పలువురు వాపోతున్నారు. ఇతర రాష్ట్రాలలో మొదటి నుంచే హిందీ భాష మీద పట్టు ఉంటుందని, తెలుగు రాష్ట్రాలలో మాత్రం ఆరవ తరగతి నుంచి హిందీ అక్షరాలను నేర్పుతున్నారన్నారు. అటువంటిది హిందీ పండితులే లేకుంటే విద్యార్థుల చదువు ఎట్లా సాగేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఖాళీగా ఉన్న హిందీ పండిత్‌లను ఆయా పాఠశాలల్లో నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు. నిజాంపేట జెడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ జ్ఞానమాలను వివరణ కోరగా హిందీ పండితుడు లేరని, వాస్తవమేనని ప్రభుత్వానికి కూడా విన్నవించడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి హిందీ పండితులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వృత్తి నైపుణ్యాలతో భవిష్యత్తుకు ఆర్థిక భరోసా

- యువతీ యువకులు వృత్తి నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

యువతీ, యువకులు వృత్తి నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుంటే వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా చేకూరుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ హాలులో జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలోని వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆసక్తిగల యువతీ, యువకులను ఎంపిక చేసుకుని వివిధ రంగాలలో వారికి శిక్షణ అందించామన్నారు. తద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. శిక్షణ తీసుకున్న యువతీ యువకులకు వారి ఆసక్తిని బట్టి ఆ రంగంలో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడం కోసం బ్యాంకుల ద్వారా లోన్స్ మంజూరు చేయనున్నామని తెలిపారు. ప్రతి అంశంలో బేసిక్స్ నేర్చుకోవాలని నూతనంగా ఆలోచించి ఆ రంగంలో నైపుణ్యత సంపాదించుకోవాలని తెలిపారు. 2022 నుంచి ఇప్పటివరకు మొత్తం 8 బ్యాచ్‌లలో 727 మంది యువతీ యువకులు వివిధ కోర్సులలో శిక్షణ తీసుకున్నారని తెలిపారు. ప్రతి కోర్స్ శిక్షణ కాలం 3 నెలలు ఉంటుందన్నారు. ప్రస్తుతం 6వ,7వ బ్యాచ్ లోని 117 మంది శిక్షణ పూర్తి చేసుకుని ఉత్తీర్ణులైన యువతీ యువకులకు సర్టిఫికెట్స్ అందజేశామన్నారు. 9వ బ్యాచ్ అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి నాగరాజు, సెంటర్ ఇన్చార్జ్ మనీషా, సిబ్బంది రాజు, లలిత, అనిత , సంతోష్, రాజేంద్రప్రసాద్ తయ్యబ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ఇతర మత్తు పదార్థాల జోలికెళ్ళద్దు

- దుబ్బాక ఎస్ఐ వి.గంగరాజు



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

విద్యార్థులు ఇష్టపడి చదువుకొని ఉన్నతంగా ఎదగాలని, గంజాయి ఇతర మత్తు పదార్థాల జోలికెళ్ళద్దని దుబ్బాక ఎస్ఐ వి.గంగరాజు అన్నారు. శనివారం దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, షీ టీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీ టీమ్ పనితీరు గంజాయి ఇతర మత్తు పదార్థాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలు వాడకం, మహిళల రక్షణ, షీ టీమ్స్ పనితీరు వంటి అంశాల గురించి, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. మహిళల భద్రత తమ ముఖ్య బాధ్యత అని అన్నారు. చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావొద్దన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. సామాజిక రుగ్మతల గురించి ఎవరైనా పిల్లలను మహిళలను వేధించినట్లయితే వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట షీ టీమ్ నెంబర్ 8712667434 కాల్ చేయాలని సూచించారు. కాల్ చేసిన వారి పేర్లు వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. అలాగే చదువుపై దృష్టి పెట్టి 10 జిపిఏ సాధించిన విద్యార్థులకు పోలీస్ శాఖ తరపున ఘనంగా సన్మానించి రివార్డు అందజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ నర్సవ్వ, అధ్యాపకులు, సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం







నవతెలంగాణ-పాపన్నపేట

ప్రభుత్వ బడుల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పని సరని జిల్లా విద్యా శాఖాధికారి రాదాకిషన్ అన్నారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చదువులో తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పకుండా ఉండాలని, ఇంటి దగ్గర చదువుకునే వాతావరణం కల్పించాలని, ఇంట్లో చదువుకునే మూలను (లర్నింగ్ కార్నర్) ఏర్పాటు చేయాలని అన్నారు. అంతేకాకుండా టివిలకు దూరంగా ఉంచాలని సూచించారు. ఇంటింటా చదువుల పంట కార్యక్రమ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని అభ్యాసాల సాధన చేయించాలని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి నీలకంఠం, ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఉపాధ్యాయులు వెంకటేశం, నాగరాజు, అంజా గౌడ్, నింగప్ప, ప్రవీణ్, వేణు గోపాల్ రెడ్డి, రియాజ్, మంగ నర్సింలు, మోహన్ రావ్, యాదయ్య, రమేష్, కృష్ణ కాంత్, అనిల్, సుభాష్, పద్మ పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేగుంట

పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని ప్రధానోపాధ్యాయులు సిద్ధిరాములు పేర్కొన్నారు. చేగుంట మండలం వడియారం ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు సిద్ధి రాములు అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరైనారు. ఈ సందర్భంగా హెచ్ఎం సిద్ధిరాములు పేరెంట్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రియదర్శిని, వసంత, సంతోషిమాత, పాఠశాల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఆధ్వర్యంలో విద్యార్థులు తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ప్రతిరోజు పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని, పాఠశాల అనంతరం ఇంటికి వచ్చిన విద్యార్థులకు చదువుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

రైతులకు మేలు చేసే ప్రభుత్వం కాంగ్రెస్



- రుణమాఫీకి ఎలాంటి షరతులు లేవు
- కృతజ్ఞతలు చెప్పాల్సింది పోయి విమర్శలు చేయడమా
- కొండ పోచమ్మ భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్

రైతుల మేలు కోరి కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని, అటువంటి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పాల్సింది పోయి విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డిలు అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రైతులకు ఎక కాలంలో రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదన్నారు. రైతుల సమస్యల కోసం ఆలోచించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీని విమర్శించడం ఎమ్మెల్యే సునీత రెడ్డికి తగదన్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు సునీత రెడ్డికి లేదన్నారు. ప్రతిసారి ప్రోటోకాల్ విషయం మాట్లాడే సునీత రెడ్డికి ఆమె పాల్గొన్న పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులను స్టేజిలపై కూర్చోబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కొండపోచమ్మ భూ నిర్వాసితుల కోసం మాట్లాడుతున్న సునీత రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళా కమిషన్ చైర్పర్సన్‌గా ఉన్న సమయంలో ఏ ఒక్క రోజైనా మాట్లాడావా అని ప్రశ్నించారు. కొండపోచమ్మ భూ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా ఆగస్టు వరకు రెండు లక్షల రుణ మాఫీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కరుణాకర్ రెడ్డి, సాయి రెడ్డి, మాజీ ఎంపీపీ లలిత నర్సింగ్ నాయక్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలి

- మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించాలని మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్ గౌడ్ అంగన్వాడీ టీచర్లకు సూచించారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఓ హేమా భార్గవి ఆధ్వర్యంలో అమ్మ మాట, అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు అంగన్వాడి టీచర్లు చిన్న పిల్లలకు అందిస్తున్న సేవలు అమోఘమని అందుకు అంగన్వాడి టీచర్లను ఆయన అభినందించారు. పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాల కాకుండా అంగన్వాడి కేంద్రాలను పంపాలని ఆయన సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో టీచర్లు పిల్లలు అభివృద్ధి కోసం అన్ని రకాలుగా కృషి చేస్తున్నారన్నారు. పిల్లలతో పాటు, తల్లులు, గర్భిణీలకు పౌష్టికారం అందిస్తున్నారని వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సీడీపీవో హేమభార్గవి మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో అంగన్వాడి టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యా బోధన చేయడంతో పాటు ఆరోగ్య రక్షణకు కృషి చేస్తున్నారని ఆమె అన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని తుకారం తండాలో అంగన్వాడి చిన్నారుల చేత మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఎర్ర గొల్ల లతా రమేష్ యాదవ్, యాదగిరి, నాయకులు ఆంజనేయులు గౌడ్, పంబళ్ల బిక్షపతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సరలకుమారి, సంతోష, అంగన్వాడీ టీచర్లు అన్నపూర్ణ, హైమావతి, వరలక్ష్మి, మమత, స్వాతి, మున్సిపల్ సిబ్బంది మధుసూదన్ పాల్గొన్నారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవెలిఘనపూర్

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే వారిపై కేసుల నమోదుతో పాటు కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ మాట్లాడుతూ చేస్తూ రేషన్ బియ్యం గతంలో అక్రమంగా తరలించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు క్రమశిక్షణ చర్యలు సంబంధిత విషయాలపై మాట్లాడారు. జిల్లాలోని శంకరంపేట-ఏ మండలంలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ రైస్ 356.50 క్వింటాళ్లు వాహనాన్ని తేది 14.02.2023 సీజ్ చేసి ఆ బియ్యాన్ని స్వాధీన పరచుకొని అట్టి బియ్యం వాహనంపైన, ఓనర్ పైన క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. స్వాదీన పరుచుకున్న బియ్యాన్ని 100% ప్రభుత్వం పరం చేస్తూ, అట్టి వాహనం పైన రూ. 4,00,000/- జరిమానా విధించటం జరిగిందన్నారు. ఆ జరిమానా రూ.4,00,000/-ను సదరు వాహణదారుడు ప్రభుత్వానికి చాలాన్ రూపంలో చెల్లించినందున వాహనాన్ని శనివారం రిలీజ్ చేసినట్లు తెలిపారు. పిడిఎస్ అక్రమ రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు,పెద్ద మొత్తంలో జరిమానాలు విధిస్తామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

మొక్కలు నాటిన యువత



నవతెలంగాణ-నిజాంపేట

ఆరోగ్యమే మహాభాగ్యం గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ఓపెన్ జిమ్ వద్ద యువకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ మానవాళి మనుగడకు చెట్లు ఎంతో దోహదపడతాయన్నారు. చెట్ల వల్లనే స్వచ్ఛమైన గాలి వస్తుందన్నారు. రావి, వేప, ఫామాయిల్, మేడి, అంజీర, కరివేపాకు, నిమ్మ దానిమ్మ, మామిడి, ఆర్కే ఫామ్, మునిగా, కానుగా, చింత, మందారం, వివిధ రకాల మొక్కలను నాటడం జరిగిందన్నారు. గ్రామంలోని యువకులు అందరూ తమ వంతుగా ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కను నాటినట్లయితే గ్రామం నందనవనంలా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిపి స్వామి, బట్ట మహేష్, శెనగపల్లి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు గ్రామశాఖ అధ్యక్షునిగా ఎల్లయ్య

నవతెలంగాణ-కోహెడ

కోహెడ మండలంలోని సముద్రాల గ్రామ మాల మహానాడు నూతన అధ్యక్షునిగా ఆరే ఎల్లయ్యను నియమించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నరాజు ప్రకటించారు. శనివారం సముద్రాలలో సంఘ కార్యవర్గ సమావేశంలో గ్రామశాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ఆరే శ్రీనివాస్, ఆరే బాలయ్య ప్రధాన కార్యదర్శిగా కిషోర్, సంయుక్త కార్యదర్శిగా ఆరే శ్రావణ్, కోశాధికారిగా ఆరే శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా ఆరే శరత్, సోషల్ మీడియా సెక్రటరీగా ఆరే అజయ్, గౌరవ సలహాదారులుగా ఆరే రవి, కార్యవర్గ సభ్యులుగా ఆరే లక్ష్మయ్య, ఆరే వెంకటయ్య, ఆరే కనకరాజు, ఆరే మల్లయ్యతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షునిగా ఎన్నికైన ఎల్లయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

రామవరం అంగన్వాడీలో బడిబాట



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో అమ్మ మాట అంగన్వాడి బాట అనే కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్ సునీత ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీలో చేర్పించాలని అన్నారు. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ తల్లులకు అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే పిల్లలు విద్యకు ఆకర్షితులయ్యే విధంగా తల్లిదండ్రులే ప్రోత్సాహం అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఎస్ రాజమణి, ఆయాలు లక్ష్మీ, సుశీల, ప్రైమరీ స్కూల్ టీచర్స్, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్లో నూతన హిందూ వాహిని కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో శనివారం హిందూ వాహిని నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర సంపర్క్ సహసంయోజక్ కస్తూరి భూమి రెడ్డి, జిల్లా సహసమ్యోజక్ బండి కిరణ్ కుమార్, జిల్లా కార్యాలయ్ ప్రముఖ్ దొడ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ హిందూ వాహిని గ్రామ అధ్యక్షునిగా ఎస్ రాకేష్, ప్రధాన కార్యదర్శులుగా కే మనోహర్, కార్యదర్శులుగా పి అరుణ్, కనకరాజు, కుమారస్వామి, దుబ్బాక మండల ప్రధాన కార్యదర్శిగా వన్నెల విజయ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రవీందర్, అవినాష్, యాదగిరి, గ్రామ యువకులు తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్‌కు నిస్వార్థంతో పనిచేస్తా

- అధ్యక్షులు బుర్కా నాగరాజు



నవతెలంగాణ-చేగుంట

లైన్స్ క్లబ్‌కు తనకు అప్పజెప్పిన బాధ్యతలను నెరవేర్చేందుకు నిస్వార్థంతో పని చేస్తానని లైన్స్ క్లబ్ అధ్యక్షులు బుర్కా నాగరాజు అన్నారు. చేగుంట మండల లైన్స్ క్లబ్ అధ్యక్షునిగా జూలై ఒకటవ తేదీ నుంచి జిల్లా చైర్పర్సన్ ద్యవ లింగమూర్తి, జిల్లా చైర్ పర్సన్ క్లబ్ డైరెక్టర్ సుఖేందర్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీలో ప్రధాన కార్యదర్శిగా రజనకు ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా సతీష్ ఎన్నికయ్యారు.

వైభవంగా విఠలేశ్వర స్వామి రథోత్సవం

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



ఆషాడ మాస ఉత్సవాలలో భాగంగా పెద్ద శంకరంపేటలో విఠలేశ్వరస్వామి రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రుక్మిణి విఠలేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి భక్తులు భజనలు చేస్తూ కీర్తనలు పాడుతూ రథాన్ని లాగుతూ పట్టణ పురవీధుల గుండా రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు స్వామివారికి మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బృందం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ దేశానికే ఆదర్శం

బెజ్జనబోయిన అనిల్, లీలా దేవి వెంకటేశం

నవతెలంగాణ-తొగుట



ప్రభుత్వం రైతులకు చేసిన రైతు రుణమాఫీ దేశానికే ఆదర్శమని, మండల పార్టీ ఉపధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్, మాజీ సర్పంచ్ పత్యుల లీలా దేవి వెంకటేశం అన్నారు. తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీని వాస్ రెడ్డి ఆదేశాల మేరకు రైతు రుణమాఫీ చేసిన శుభ సందర్భగా గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలా భిషేకం చేసి మిఠాయిలు పంచుకొని టపాకాయలు కాల్చి సంబరాలు చేశారు. అదే విధంగా వన మహోత్సవంలో భాగంగా చెరువు కట్ట మీద మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీని యర్ నాయకులు పంది రాజు, బెజ్జనబోయిన రాములు, షాపి, శేఖర్, ఎన్ఎస్యుఐ మండల అధ్యక్షులు బెజ్జనబోయిన ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ కోసం కృషి చేయాలి

నవతెలంగాణ -నంగునూరు



మొక్కల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్, ఇంచార్జి ఎపీఓ ప్రభాకర్ రావు పిలుపునిచ్చారు. శనివారం నంగునూరు మండలం నర్మెట గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. అంక్షాపూర్ శివారు నుంచి నర్మెట వరకు, నర్మెట నుంచి వెంకటాపూర్ శివారు వరకు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నరేడ్ల సురేష్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజా రత్నం, కారోబర్ రాజు, ఈజీఎస్ సిబ్బంది, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆర్యవైశ్య భవన్ ఎన్నికలు

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌కు రసవత్తరంగా ఆదివారం ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో నిలబడ్డ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వైశ్య భవన్‌లో 577 ఓట్లు ఉన్నాయి. అధ్యక్ష పదవికి ముగ్గురు అభ్యర్థులు, రెండు ఉపాధ్యక్షుల పోస్టులకు ఐదుగురు అభ్యర్థులు, ప్రధాన కార్యదర్శి పోస్టుకు ముగ్గురు, రెండు సహాయ కార్యదర్శుల పోస్టులకు ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. కోశాధికారిగా గంప కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నికలు జరగనున్నాయి. అనంతరం ఓట్ల లెక్కింపు ఉంటుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రధాన రహదారుల వెంబడి, వైశ్య భవన్ వద్ద పెద్ద ఎత్తున బ్యానర్ లను ఏర్పాటు చేశారు.

ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-వర్గల్

వర్గల్ మండలకేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరం 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం అర్హులైనవారు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ వతెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపుపొందిన పాఠశాలలో 5వ తరగతి వరకు చదివి ఉండాలని, తల్లిదండ్రులు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందినవారై ఉండాలి. ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటర్నెట్ సెంటర్ ద్వార లేక ఫోన్ ద్వార ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులకు గాను విద్యార్థి ఫోటోతోకూడిన ధ్రువపత్రాలపై ప్రధానోపాధ్యాయుడి సంతకం చేసిన ధ్రువపత్రలతో దరఖాస్తు చేసుకోకాలని తెలిపారు. ఆన్లైన్‌లో దరఖాస్తులు సమర్పించడానికి 2024 సెప్టెంబర్ 16 చివరి తేదీ అని, ప్రవేశ పరీక్ష 2025 జనవరి 18 రోజున ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు..

రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-మద్దూరు



కాంగ్రెస్ జాతీయ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఆదేశాల మేరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ కి సీఎం రేవంత్ రెడ్డి, శ్రీకారం చుట్టి రైతు బాంధవుడిగా నిలిచిపోయారని యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇంచార్జి చెట్కూరి కమలాకర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడతలు లక్షలు రుణాలను మాఫీ చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని తెలిపారు. రైతు శ్రేయస్సు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సహాయ వంట మనిషి పోస్టులకు ఇంటర్వ్యూ

నవతెలంగాణ-జగదేవ్‌పూర్



జగదేవపూర్ మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల బాలికల వసతి గృహంలో సహాయ వంట మనుషుల పోస్టుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమములో మండల అభివృద్ధి అధికారి యాదగిరి, మండల విద్యాధికారి ఉదయ భాస్కర్ రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులకు వసతి గృహంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఉమా మహేశ్వరి, సీఆర్పీ దయానంద్ వసతి గృహం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిల్స్ అందజేత

నవతెలంగాణ- జగదేవ్‌పూర్



జగదేవ్‌పూర్ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ప్లేట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. 6 తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యానభ్యసిస్తున్న 125 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, వాటర్ బాటిల్స్, డిక్షనరీలు అందించడం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస స్వామి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నర్మద, ట్రస్ట్ చైర్మన్ లక్ష్మణ్, కోశాధికారి దుర్గాప్రసాద్ కార్యదర్శి మధుసూదన్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర రామసేవ అమోఘం

సిద్దిపేట జిల్లా యోగా గురువు నాగేష్ జీ

నవతెలంగాణ -గజ్వేల్



శ్రీరామ నామాన్ని తను లిఖిస్తూ నేడు లక్షల మంది భక్తులచే లిఖింపజేయడం వల్ల రామకోటి రామరాజు కృషి పట్టుదలకు గాను నేడు భక్తిరత్న జాతీయ గౌరవ పురస్కారం రావడం చాలా ఆనందంగా ఉందని సిద్దిపేట జిల్లా యోగా గురువు నాగేష్ జీ గారు అన్నారు. శనివారం గజ్వేల్ లో రామకోటి రామరాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యోగా గురువు నాగేష్ జీ మాట్లాడుతూ భక్తులకోసం శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థను స్థాపించి రామకోటి పుస్తకాలను అందిస్తూ గత 25ఏళ్ల నుంచి భక్తి పరమైన ధార్మిక కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు ఎన్నో నిర్వహించడం రామకోటి రామరాజు భక్తికి నిదర్శనం అన్నారు. రామకోటి రామరాజు అందించిన నామలేఖన పుస్తకాలలో మా నాన్న బొందుగుల గురుపాదం కోటి రామనామాలు లిఖించారన్నారు. నాక్యూడా రామనామాలు లిఖించే భాగ్యం ఆ స్వామి వల్లే కలిగిందన్నారు. లక్షల మందిని భక్తి మార్గంలో నడపడం అందకి సాధ్యం కాదన్నారు. రామకోటి రామరాజు కృషి, పట్టుదలతోనే నేడు సాధ్యం అయిందన్నారు.

తిప్పారం పాఠశాలలో గోరింటాకు సందడి

నవ తెలంగాణ - కొండపాక



కొండపాక మండలం కుకునూరు పల్లి మండలం తిప్పారం ప్రాథమిక పాఠశాలలో ఆషాడ మాసం సందర్భంగా శనివారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి గోరింటాకు పెట్టుకున్నారు. గోరింటాకు విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. పండగ వాతావరణంలో గోరింటాకు సందడి చేశారు. కార్యక్రమంలో ఏఏపీపీ చైర్ పర్సన్ రేణుక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. రవి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మాధురి విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలోని సేవలు గుర్తింపునిస్థాయి

నవతెలంగాణ -నంగునూరు



విధి నిర్వహణలో చేసిన సేవలు శాశ్వతంగా గుర్తింపునిస్థాయిని ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ ప్రభాకర్ రావు అన్నారు. శనివారం నంగునూరు మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.మహేశ్ బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులు ఎప్పుడూ గుర్తింపు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ కె.జ్యోతి నాయకులు రేకులపల్లి కోటిరెడ్డి పాల్గొన్నారు.

రైతులను మురిపించిన మోస్తారు వర్షం

- గజ్వేల్‌లో 45 రోజులుగా ఎదురుచూపులు

నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో వర్షాకాలం ప్రారంభం నుంచి మోస్తారు వర్షాలు 45 రోజుల తర్వాత రెండు రోజులుగా కురుస్తున్న మోస్తారు వర్షాలు రైతులను మురిపిస్తున్నాయి. ఇప్పటికీ గజ్వేల్ వ్యవసాయ డివిజన్లో రెండు సార్లు పత్తి విత్తనాలు విత్తన రైతులు తిరిగి మళ్లీ విత్తనానికి ప్రారంభమయే సమయంలోనే మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. మొదటగా వేసిన విత్తనాలు విత్తకపోవడంతో మరోసారి విత్తనాలు విత్తినారు. దీంతో రైతులపై అదనంగా భారం పడిందని చెప్పాలి. గత పక్షం రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షా లేకపోవడంతో చాలాచోట్ల మొక్కలు ఎండిపోవడంతో రైతులు దిగులు చెందినారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. పత్తి, మొక్కజొన్న ఇతర పంటల ఎదుగుదలకు ఈ వర్షాలు ఉపయోగపడతాయని రైతులు భావిస్తున్నారు. వర్షాకాలం సీజన్లో సిద్దిపేట జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు సాగు లక్ష్యం ఉందని వ్యవసాయ అధికారులు అంచన వేశారు. ఇందులో పత్తి 1.80 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుండగా, వరి సాగు మూడు లక్షల ఎకరాల్లో పండిస్తున్నారని అధికారులు ప్రతిపాదించారు. మిగతా పంటలు మొక్కజొన్న, కంది ఇతర పంటలు సాగు చేస్తున్నారు. జూన్ మొదటి వారంలో ఒక్కరోజు కురిసిన వర్షాలకు చాలామంది రైతులు పంటలు సాగు చేసుకున్నారు. జూన్, జూలైలో చాలా మండలాల్లో లోటు వర్షపాతం నమోదయింది. శుక్రవారం, శనివారం కురిసిన మోస్తారు వర్షాలకు అక్కడక్కడ ఆయా మండలాల్లో మూడు మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసినట్లు ఆయా శాఖ అధికారులు అంచన వేశారు. ఈ వర్షం పత్తి పంటకు మొక్కజొన్నకు ఇతర పంటలకు ఊపిరి పోసిందని రైతులు అంటున్నారు. 45 రోజులపాటు వర్షం కోసం గజ్వేల్ , సిద్దిపేట, దుబ్బాక, వర్గల్, ములుగు, రాయపూల్, కొండపాక, జగదేవ్పూర్, మర్కుక్, తదితర మండలాల్లో రైతులు వర్షం కోసం ఎదురుచూశారు.కొంతవరకు ఈ వర్షం పంటలకు జీవం పోసిందని రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 90 వేల ఎకరాల్లో పత్తి సాగు కాగా, 15 వేల ఎకరాల్లో వరి, 3 వేల ఎకరాల్లో కంది, 20వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఒక్కొక్క ఎకరాకు దాదాపు రూ. 12 వేల ఖర్చయినట్లు రైతులు తెలిపారు. దీన్ని బట్టి రైతులు సిద్దిపేట జిల్లాలో రూ.110 కోట్ల మేర పెట్టుబడులు పెట్టినట్లు వ్యవసాయ అధికారులు అంచనాకు వచ్చారు. ఇందులో ఎక్కువగా పత్తికి ఖర్చు ఎక్కువైందని రైతులు చెప్తున్నారు. బోరు ఇతర సౌకర్యాలు ఉన్న రైతులు మాత్రం జూన్ మొదటి వారంలో వేసిన కొన్ని విత్తనాలు ఇప్పటివరకు కాపాడుతూ వచ్చారు. మొక్కజొన్న రైతుల కూడా రెండుసార్లు విత్తనాలు ఇచ్చినట్లు చెప్తున్నారు.





మోస్తారు వర్షం లాభం

రైతు నర్సింలు. టెంకంపేట.



గజ్వేల్ ప్రాంతంలో వానకాలం ప్రారంభం నుంచి రెండు రోజులపాటు కురుస్తున్న మోస్తారు వర్షాలు లాభం. మొక్కలు ఎండిపో దశలో వర్షాలు కురుస్తున్నాయి. ఇది రైతులకు లాభం

అన్ని పంటలకు లాభమే

రైతు కిష్టయ్య. సంగుపల్లి, గజ్వేల్



మోస్తారు వర్షాలు అన్ని పంటలకు లాభమే. 45 రోజులపాటు వర్షం కోసం ఎదురు చూశాం. బిందెలతో నీళ్ల పోసి పంటను కాపాడుకున్నాం. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుకు ఊపిరి పోసింది.

రైతుల సమస్యలపై పార్లమెంటులో చర్చించాలి

- అన్ని పంటలకు కనీసం మద్దతు ధర ప్రకటించాలి
- మల్కాజ్గిరి ఎంపీకి ఎస్‌కేఎం వినతి

నవతెలంగాణ- గజ్వేల్



పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) సీ2 ప్లస్ 50 శాతం ప్రాతిపదికన ఇచ్చేందుకు చట్టబద్ధత కల్పించాలని, పంటలను గ్యారెంటీగా సేకరించాలని, కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని, రైతుల సమస్యలపై పార్లమెంటులో చర్చించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కెఎం) రాష్ట్ర కన్వీనర్ తీగల సాగర్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్ రాములు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌లు ఎంపీ నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణభారం నుంచి విముక్తి కల్పించి రైతు ఆత్మహత్యలకు ముగింపు పలకడానికి సమగ్ర రుణమాఫీ చెయ్యాలన్నారు. విద్యుత్ రంగం ప్రయివేటీకరణ ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని ప్రభుత్వ రంగం కింద అన్ని పంటలకు, పశుపోషణకు సమగ్ర బీమా కవరేజీ ఇవ్వాలని కోరారు. రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల పీఎంఎఫ్‌బీవై పథకాన్ని సవరణ చేయాలని డిమాండ్ చేశారు.రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ నెలకు రూ.10 వేలు చొప్పున పెన్షన్ ఇవ్వాలన్నారు. భూసేకరణ, పునరావాస చట్టం-2013 ను అమలు చేసి, దేశం అంతటా ప్రతి ఏటా భూమి మార్కెట్ రేటును సవరించాలన్నారు. ప్రభుత్వప్రయివేట్ రంగం ప్రాజెక్టుల కోసం అక్రమంగా సేకరించడం వల్ల భూమిని కోల్పోయిన వారందరికీ తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.బుల్డోజర్ రాజ్‌కు ముగింపు పలకాలని, ముందస్తు పునరావాస ఏర్పాట్లు చేయకుండా మురికివాడల, నివాసాల కూల్చివేతను ఆపాలన్నారు.ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, విద్యుత్, నీటిపారుదల, పెట్రోలియం ఉత్పత్తులు, యంత్రాలు, ట్రాక్టర్లు వంటి వ్యవసాయ ఇన్‌పుట్‌లపై జీఎస్టీ ఆపాలన్నారు. జీడీపీలో తగిన వాటాతో వ్యవసాయం కోసం ప్రత్యేక కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని, కేంద్ర ప్రభుత్వంలో సహకార మంత్రిత్వశాఖను రద్దు చేయాలని, రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా సహకారాన్ని రాష్ట్ర అంశంగా ఉంచాలన్నారు. ఉత్పత్తి వర్గాలైన రైతులు, కార్మికుల ఖర్చుతో కార్పొరేట్ వర్గ ప్రయోజనాల కోసం అధికార కేంద్రీకరణను ప్రోత్సహించే బదులు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మద్దతు ఇవ్వాలన్నారు. వన్యప్రాణుల ముప్పు కోసం శాశ్వత పరిష్కారాన్ని నిర్ధారించాలని, ప్రాణ నష్టానికి పరిహారంగా రూ.1 కోటి, పంటలు, పశువుల నష్టానికి తగిన పరిహారం అందించాలని,లఖింపూర్ ఖేరీ అమరవీరులతో సహా చారిత్రాత్మక రైతుల పోరాట అమరవీరుల కుటుంబాలకు పరిహారం అందించాలన్నారు. రైతుల పోరాటానికి సంబంధించిన అన్ని కేసులనూ ఉపసంహరించుకోవాలన్నారు. 736 మంది రైతు అమరవీరుల స్మారకార్థం సింగు, టిక్రీ సరిహద్దుల్లో అమరవీరుల స్మారకాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు.

గుంతల మయంగా మారిన రోడ్లు

- పట్టించుకోని పాలకవర్గం
- నలుగురు మున్సిపల్ కమిషనర్‌ల దృష్టికి తీసుకువెళ్లినా పట్టింపు లేదు

నవ తెలంగాణ - సిద్దిపేట



చినుకు పడిందంటే ఆ వార్డు ప్రజలకు రోడ్లపై నడవాలంటే జంకు పుడుతుంది. చిత్తడిగా మారి, గుంతలమయంగా ఏర్పడి రోడ్లన్నీ ప్రమాదకరంగా మారాయి. అనేక అవార్డులు అందుకున్న సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 18వ వార్డు పరిస్థితి. గత నాలుగైదు ఏండ్ల క్రితం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం 18 వ వార్డులోని అనేక కాలనీలలో పనులు జరిపించారు. కానీ పైప్ లైన్ వేసినప్పటికీ తవ్విన రోడ్లను మాత్రం మరమ్మత్తులు చేయకపోవడం, సీసీ రోడ్లు పోయక పోవడంతో రోడ్లన్నీ గుంతల మయంగా మారి పాదచారులను, వాహన దారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మున్సిపల్ కమిషనర్లు, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన పనులు జరగడం లేదని, పాలకవర్గం, అధికారులు పట్టించుకోవడంలేదని వార్డు కౌన్సిలర్, వార్డు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్లు పోయాలని వార్డు ప్రజలు, వార్డు నాయకులు అధికారులను, మున్సిపల్ పాలకవర్గాన్ని కోరుతున్నారు.

పలు కాలనీలో నిలుస్తున్న నీరు

18 వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం మున్సిపల్ అధికారులు గుంతలు తవ్వి పైప్ లైన్ వేశారు. చాంబర్లను సైతం నిర్మించారు. కానీ తవ్విన గుంతలను సీసీ రోడ్లతో నిర్మించకపోవడంతో అనేక ప్రాంతాలలో గుంతలు పడి వర్షాకాలంలో వర్షపు నీరు నిలుస్తుంది. దీంతో దోమల బెడద కూడా ఎక్కువ ప్రజలను అనారోగ్య పాలు చేస్తున్నాయి. కొన్నిసార్లు గుంత ఎంత లోతు ఉందో తెలువక వాహనదారులు జారిపడిన సంఘటనలు కూడా లేకపోలేదు. పాదచారులకు కూడా నడవాలంటే ఇబ్బందికరంగా మారింది. వర్షపు నీరు నిలుస్తున్నాడంతో దుర్వాసన కూడా వెదజల్లుతున్నాయి.

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు

అడ్డగట్ల శేఖర్, అంజి. బీఆర్ఎస్ నాయకులు



ప్రమాదకరంగా మారిన రోడ్లను కొత్తగా నిర్మించాలని మారుతూ వస్తున్న నలుగురు మున్సిపల్ కమిషనర్లకు, జిల్లా అదనపు కలెక్టర్‌కు, జిల్లా కలెక్టర్‌కు, ప్రజావాణిలో, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. మల్యాల బాలవ్వ, శ్రీనివాస్ రెడ్డి, రాజ మహమ్మద్, కండక్టర్ రంగయ్య, పాత సిటిజెన్ స్కూల్ కాలనీలలో రోడ్లన్నీ ప్రమాదకరంగా మారాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్య పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్య వెంటనే పరిష్కరించాలి.

అంగన్వాడీలో అమ్మ మాట-అంగన్వాడీ బాట

నవతెలంగాణ-చేర్యాల





చేర్యాల పట్టణ కేంద్రం యాదవ నగర్ లోని అంగన్వాడీ కేంద్రంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రజ్ఞా దేవి సమక్షంలో అంగన్వాడీ టీచర్ పి.స్వరూప రాణి ఆధ్వర్యంలో శనివారం అమ్మ మాట- అంగన్వాడీ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ యాదవ నగర్ పరిధిలోని ఉట్లపల్లి, కర్షకనగర్ వాసులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ మాట్లాడుతూ రెండున్నర ఏండ్ల నుంచి ఐదు ఏండ్ల పిల్లలను అంగన్వాడీ సెంటర్‌లో చేర్పించాలని సూచించారు. కొత్తగా చేరిన పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. అంగన్వాడీ సెంటర్ నుంచి గర్భిణీలకు, బాలింతలకు ఇచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ మండలం జాలిగామ గ్రామ రెండవ అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట-అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించినట్లు టీచర్ సునీత తెలిపారు. ఈసీసీ ఈడే అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. అక్షరాభ్యాసం పొందిన అక్షిత, శన్విక, అనన్య, నవ్య, యశ్వంత్ తదితరులకు అక్షరాభ్యాసం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ ఆశలు అరుంధతి, లావణ్య, హెల్పర్ ఐలవ, గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలి

- జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు కొమ్ము ఉమేష్ యాదవ్

నవతెలంగాణ -గజ్వేల్



ఆగస్టు నెల 5, 6 తేదీల్లో నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిద్దిపేట జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు కొమ్ము ఉమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్ కృష్ణ ఆధ్వర్యంలో పార్లమెంటు ముట్టడి జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమానికి లక్షలాదిమందిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ బీసీ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. బీసీ ప్రత్యేక మంత్రుత్వ శాఖ ఏర్పాటు చేయాలని జనాభా గణనలో బీసీ కుల గణన చేయాలని దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని గవర్నమెంట్ సంస్థలో ప్రయివేటీకరణ నిషేధించాలన్నారు.బీసీ క్రిమిలేయర్‌ను ఎత్తి వేయాలని ప్రమోష న్లలో రిజర్వేషన్లు వర్తింపజేయాలని బడ్జెట్లో బీసీలకు రూ.5లక్షల కోట్లు కేటాయించాలన్నారు. బీసీలంటే కేవలం ఓట్లు వేసే యంత్రాలుగనే ఈ ప్రభుత్వాలు దేశ గవర్నమెంట్ ఉద్యోగాలలో బీసీలు 7 శాతం కూడా లేకపోవడం సిగ్గుచేటు చేటు అన్నారు. రాజకీయంగా 12 శాతం దాటలేదు బీసీలు. రాష్ట్ర ప్రభుత్వం ఏమో బీసీలకు స్థానిక సంస్థల 42శాతం రిజర్వేషన్ అని చెప్పి దాన్ని అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. బీసీల కోసం ఢిల్లీలో ధర్నా చేస్తాం బీసీ బిల్లుకు మద్దతు అని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదన్నారు.బీసీ బిల్లుకు మద్దతు తెలపకపోతే కేంద్ర ప్రభుత్వం గద్దె దింపుతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కొన్నామేనా కన్న యాదవ్, అకారం రాజు యాదవ్, సిద్దిపేట జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షుడు కొమ్ము రాజు, సిద్దిపేట టౌన్ ప్రెసిడెంట్ కృష్ణపురం లక్ష్మణ్ బాబు ముదిరాజ్ సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణలపై అసెంబ్లీలో చర్చించాలి

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

నవతెలంగాణ -గజ్వేల్



ఈ నెల 23 నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో దళుతుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణల పై చర్చించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ విధంగా చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయలన్నారు.గత ప్రభుత్వం అమలు చేసిన దళిత బందు పథకం రూ.10 లక్షలకు బదులు అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ.12 లక్షలు ఇస్తానన్న హమీని నిలబెట్టుకొవడానికి మార్గదర్శకాలను రూపొందించాలన్నారు.ఎస్సీ, ఎస్టీ కమీషన్ ను విడదిసి ఎస్సీ కమీషన్, ఎస్టీ కమీషన్ లను ఏర్పాటు చేస్తాననే హామీ నిలబెట్టుకొవాలన్నారు.

గత 1ళ నుండి నూతన రేషన్ కార్డులు రాకపోవడం వలన ప్రభుత్వ పరంగా వచ్చే పథకాలకు దళిత, బహుజనులు అనర్హులుగా మిగిలిపోతున్నారు. గనుక వెంటనే రేషన్ కార్డు జారిపక్రియ కొనసాగే విధంగా చేయలన్నారు.రైతు రుణమాఫీ పక్రియలో ఎటువంటి నిబంధనలు పెట్టకుండా ప్రతి రైతుకు పాసు బుక్ ప్రామాణికంగా అమలుచేయలన్నారు. గత ప్రభుత్వం హయంలో 29.144 కొట్లు మాత్రమే రుణమాఫీ చేశారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం 8 మాసాలలోనే 31 వేల కొట్లు రుణమాఫీ చేశారని చెబుతున్న ప్రభుత్వం గత ప్రభుత్వానికి అదర్శంగా ఉండాలంటే రుణమాఫీని శరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై రోజుకో దగ్గర దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతున్నందున, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడానికి, శాంతి బద్రతలకు అటంకం లేకుండా ఉండటానికి సాంఘీక సంక్షేమ మంత్రిని, విద్యాశాఖ మంత్రిని, హెూం మంత్రిలను కేటాయించాలన్నారు.ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు చంద్రం పాల్గొన్నారు.

రైతుల లెక్క తప్పిన సీఎం

- గుర్తుకు రాని కౌలు రైతులు
- ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ -గజ్వేల్



రాష్ట్రంలో రైతులు ఎంతమంది ఉన్నారో, ఎంతమందికి భూమి ఉన్నదో, ఎంతమంది బ్యాంకులో రుణాలు తీసుకున్నారో సీఎం రేవంత్ రెడ్డికి తెలుసా అని, రైతుల లెక్క తప్పిన సీఎం అని ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల లెక్కలను తప్పించినట్లు విమర్శించారు. రాష్ట్రంలో 39 లక్షల మంది రైతులకు రుణమాఫీ జరగవలసిందని కేవలం 11 లక్షల మందిని ఎంపిక చేసి మిగతా రైతులను సీఎం వదులుకున్నారని అన్నారు. బ్యాంకులో అప్పులు తీసుకున్న రైతుల్లో ఒకటో వంతు రైతులకు రుణమాఫీ చేసి రేవంత్ రెడ్డి చంకలు కొట్టుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేయడమే కాకుండా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటివరకు రైతు భరోసా లేదని, రైతుబంధు లేదని, పెంచే పెన్షన్ నిధులు తీసుకువచ్చి రుణమాఫీ కి నిధులు బదిలీ చేశారని అది కూడా చారాన రైతులకు బారాణ ఖర్చు చేశారని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం రావడానికి ముందు ఇచ్చిన హామీలు కౌలు రైతుల పరిస్థితిని తాము అర్థం చేసుకున్నామని ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియాగాంధీ నోటితో సీఎం రేవంత్ రెడ్డి చెప్పించినట్లు పేర్కొన్నారు. కౌలు రైతుకు ఎకరాకు పెట్టుబడి రూ.15 వేల ఇస్తామని కాంగ్రెస్ అగ్రనేతలతో చెప్పించిన ప్రభుత్వం అధికారం రాగానే చేతులు దులుపుకుందన్నారు. రైతులకు రూ.31 వేల కోట్ల రుణమాఫీ గాను కేవలం రూ.6వేల కోట్ల రూపాయలు మాత్రమే చేసినట్లు చెప్పారు. కౌలు రైతులను ఆదుకోకపోతే ప్రత్యేక ఉద్యమాన్ని చేపడతామన్నారు. కౌలు రైతులను సీఎం రేవంత్ రెడ్డి చులకన చూస్తున్నారని విమర్శించారు.

మత్స్య సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా మెట్టు సాయికుమార్



నవ తెలంగాణ - మిరుదొడ్డి

రాష్ట్ర మత్స్య సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన మెట్టు సాయికుమార్ సన్మానించిన అక్బర్ పేట భూంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. మత్స్య శాఖ కార్యాలయంలో ఆయనను శాలువాతో సత్కరించి, పూల బోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫిషర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి శంకర్ స్వామి గౌడ్ మాట్లాడుతూ కుల వృత్తులకు పునాది వసిన నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంకే దక్కిందని అన్నారు. కాంగ్రెస్‌లో పేద బడుగు, బలహీన వర్గాలకు ఎంతగానో అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్బర్ పేట భూంపల్లి ఫిషర్ మెన్ మండల అధ్యక్షుడు అన్నబోయిన చంద్రశేఖర్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పంజా నరేష్, అక్కపల్లి పరమేష్ గౌడ్, వేల్పుల యాదగిరి ముదిరాజ్, జంగి బిక్షపతి, షేర్ పల్లి స్వామి, అన్నబోయిన ప్రభాకర్, పిట్ల భూపతి, నీల నరేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల పిల్లలను అంగన్‌వాడీకి పంపించాలి

- సీడీపీఓ సరిత



నవతెలంగాణ-జగదేవ్‌పూర్

మూడేళ్లలో పిల్లలను తల్లిదండ్రులు అంగన్ వాడీకి పంపించాలని సీడీపీఓ సరిత పేర్కొన్నారు. అమ్మ మాట-అంగన్ వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం జగదేవపూర్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని,ప్రయివేటు పాఠశాలలకు పంపించవద్దని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తారని వివరించారు.ప్రయివేట్ పాఠశాలకు పిల్లలను పంపించి డబ్బులను వృధా చేసుకోవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆటపాటలతో పాటు విద్యను అందిస్తారన్నారు. అంగన్‌వాడీ సేవలకు ప్రతి ఒకరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు భవానీ, రజిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు బీజేపీ, బీఆర్ఎస్‌కు లేదు

- జేఏసీ నాయకులు



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

రైతుల ఉసురు తీసిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదని జేఏసీ నాయకులు విమర్శించారు. శనివారం కాంగ్రెస్ రెండు లక్షల రుణమాఫీ చేయడంపై హుస్నాబాద్‌లో జేఏసీ నాయకుల సమావేశం ఏర్పాటు చేసి హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో రైతులందరికీ రెండు లక్షల రుణా మాఫీ కోసం రూ.31 వేల కోట్లు కేటాయించిందన్నారు. మొదటి విడుతలో రూ.ఏడు కోట్ల రుణమాఫీ చేశారన్నారు. గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ కోసం పది ఏళ్లు గడిచిన చేయలేదన్నారు.బీజేపీ అధికారంలోకి వస్తే నల్లధనాన్ని వెనక్కి ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. ప్రజాపాలన కోసం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతుల పక్షాన నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు లక్ష్మారెడ్డి, మేకల వీరన్న యాదవ్, డ్యాగాల సారయ్య, చెప్పేల ప్రభాకర్, ప్రకాష్, ఏధుల పురం తిరుపతి, కోహెడ కొమురయ్య, మల్లేశం, రేణిగుంట బిక్షపతి, రాజగోపాల్ రావు పాల్గొన్నారు.

హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా

- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొమురయ్య

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొమురయ్య అన్నారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్లో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కోహెడ కొమురయ్య సమక్షంలో మండల పట్టణ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కోయడ కొమురయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన గీతా కార్మికుల ప్రధాన డిమాండ్లు సేఫ్టీమోకులు, మోటారు బైకులు, గుర్తింపు కార్డులు , ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షల పెంపు, తాళ్లు ఎక్కుతూ రిటైర్మెంట్ అయిన వారికి రూ.5 లక్షల బెల్ట్ షాపులు బంద్, భూమిలేని గ్రామాలలో ఐదు ఎకరాల భూమి కేటాయించాలనే భీమండను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.ఈ కార్యక్రమంలోమాజీ ఎల్లమ్మ గుడి చైర్మెన్ పూదరి లక్ష్మీనారాయణ గౌడ్, ఇల్లందుల పరిశయ్య పూదరి రామస్వామి, పాకాల సమ్మయ్య గౌడ్, బుర్ర లింగయ్య గౌడ్, పూదరి హరీష్, పూదరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందజేసిన పీఏసీఎస్ చైర్మెన్

- నామినికి రూ.2 లక్షల పీఎంజేజేవై పంపిణీ

నవతెలంగాణ-బెజ్జంకి



కేడీసీసీ ఖాతాదారురాలు సుమలత మృతి చెందడంతో పీఎంజేజేవై పథకంలో రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును శనివారం మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంకు అవరణంలో పీఏసీఎస్ చైర్మెన్ తన్నీరు శరత్ రావు మృతురాలి నామినికి బ్యాంక్, పీఏసీఎస్ సిబ్బందితో కలిసి అందజేశారు. ప్రతి ఒక్క ఖాతాదారుడు ప్రమాద బీమా సేవలను వినియోగించుకోవాలని పీఏసీఎస్ చైర్మెన్ తన్నీరు శరత్ రావు సూచించారు.బ్యాంక్ మేనేజర్ ప్రవీన్, సూపర్ వైజర్ దుర్గం, పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్, సిబ్బంది బుచ్చయ్య అనిల్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

186 మంది రైతులకు రుణమాఫీ

పీఏసీఎస్‌లో వ్యవసాయ రుణాలు పొందిన సుమారు 186 మంది రైతులు మొదటి విడత రుణమాఫీకి ఎంపికయ్యారని పీఏసీఎస్ చైర్మెన్ తన్నీరు శరత్ రావు తెలిపారు.రూ.1,17,66,963 ప్రభుత్వ రుణమాఫీ చేసిందని శరత్ రావు పేర్కొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీని శనివారం జిల్లా అధ్యక్షుడు కోహెడ కొమురయ్య సమక్షంలో ఎన్నుకున్నారు.మండల అధ్యక్షులుగా పచ్చిమట్ల రవీందర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శిగా మామిడి తిరుపతి గౌడ్, ఉపాధ్యక్షులుగా బండారి కిష్టయ్య గౌడ్, గాదగోని కొమురయ్య గౌడ్, మండల సహాయ కార్యదర్శిగా బొమ్మగోని ఎల్లయ్య కోడూరు మల్లేశం గౌడ్, మండల కోశాధికారిగా సదానంద గౌడ్‌ను ఎన్నుకున్నారు.పట్టణ అధ్యక్షులుగా పూదరి రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా కోయడ శ్రీనివాస్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ శ్రీనివాస్, పట్టణ కోశాధికారిగా పూదరి చంద్రమౌళి గౌడ్, సహాయ కార్యదర్శులుగా పూదరి రవీందర్ చిన్న, పూదరి మహేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదు

- మొదటి విడతలో లక్షలోపు రుణమాఫీ
- ఏఓ సంతోష్



నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీలో రేషన్ కార్డు ప్రామాణికం కాదని మొదటి విడతలో అసలు, వడ్డీ కలిపి లక్షలోపు రుణం మాఫీ వర్తిస్తుందని ఏఓ సంతోష్ శనివారం తెలిపారు.లక్ష దాటిన రుణం మరో విడతలో రుణమాఫీ వర్తిస్తుందని, రుణమాఫీపై రైతులు ఆందోళన చెందవద్దని ఏఓ తెలిపారు.

పీఎస్‌డబ్ల్యూఏ నూతన కార్యవర్గం ఎన్నిక

నవ తెలంగాణ - సిద్దిపేట



పబ్లిక్ సర్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎస్‌డబ్ల్యూఏ) సిద్దిపేట జిల్లా 2024-25 ఏడాదికి గాను అధ్యక్షులుగా అయి త అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా కోమండ్ల విక్రంరెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా కల్లేపల్లి శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా కెమ్మసారం పోచయ్య, నేరెళ్ల కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శులుగా గడ్డం బాలకిషన్, బట్టు శ్రీనివాసరాజు, ఆర్థిక సంఘం సభ్యులుగా చిలుకోటి రాంరెడ్డి, లింగా శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా పోతుల సత్యనారాయణ, దొడ్డ రాజేందర్, సుంచు భూమయ్య, బోరెడ్డి రామచంద్రారెడ్డి, తాళ్ల శ్రీనివాసులు ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి సంధి రెడ్డి యాది రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిలు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి మమ్మల్ని, మా కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్న జీవిత సభ్యులకు, నాలుగు సంఘాల అధ్యక్ష కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. పబ్లిక్ సర్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఇంకా మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులపై ప్రత్యేక శ్రద్ధ

నవ తెలంగాణ- దుబ్బాక



విభిన్న ప్రతిభావంతుల కోసమే మన భవిత సెంటర్ ఉందని, వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని అలాంటి పిల్లల్ని 'మన భవిత కేంద్రం'లో చేర్పించడం ద్వారా చదువుతోపాటు అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఇన్క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ) ఎస్.రమ చెప్పారు.శనివారం దుబ్బాక పురపాలక కేంద్రంలోని మండల వనరుల కేంద్రం వద్ద గల 'మన భవిత సెంటర్'లో నిర్వహించిన పేరెంట్ టీచర్ సమావేశంలో భాగంగా విభిన్న ప్రతిభావంతుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ప్రభుత్వ ఆదేశాలు, మండల విద్యాధికారి జే.ప్రభుదాస్ సూచనల మేరకు ప్రతినెల 4వ శనివారం పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.విద్యార్థులకు చక్కటి విద్యా బోధనతో పాటు రవాణా, ఎస్కార్ట్ అలవెన్స్‌లు, సహాయ ఉపకరణాలు, వారంలో ఒకరోజు ఫిజియోథెరపీ, ఆటపాటలతో కూడిన హెూమ్ బేస్ ఎడ్యుకేషన్ మరెన్నో సదుపాయాలు కల్పిస్తారని స్పష్టం చేశారు.

పథకాలను సమర్థవంతంగా అమలుకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి





నవ తెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జిల్లాలో ట్రాన్స్ఫర్ అయిన 110 మంది గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బదిలీ ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర చాలా ముఖ్యమైనదని, గ్రామాలలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలతో పాటు ఇతరత్రా ప్రభుత్వ ప్రాధాన్యత అన్ని విధులను మీరు నూతనంగా చేరబోయే గ్రామపంచాయతీలలో సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, డివిజనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున్, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు యూనిట్లతో ఆర్థికంగా ఎదగాలి

- పర్యటక కేంద్రం ఏర్పాట్లను పరిశీలన
- అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

మహిళ సంఘాలు నిర్వహించే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పెద్ద మొత్తంలో నిర్వహించి ఆర్థికంగా ఎదగాలని అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. శనివారం హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలోని మహిళా సంఘాలు నిర్వహించే నానో ఓవెన్ బ్యాగ్స్ యూనిట్, పేపర్ ప్లేట్స్ తయారీ యూనిట్, గార్మెంట్స్ యూనిట్‌లను అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ సందర్శించారు. ఒక్కో యూనిట్ ఏ విధంగా నడుస్తున్నాయని, మార్కెటింగ్ ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఇంకా మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని లాభ సాటిగా యూనిట్‌లు సాగేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట్ డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, అడిషనల్ డీఆర్డీఓ మధుసూదన్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కర్ణాకర్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఏపీఎం జి శ్రీనివాస్ గౌడ్, సీసీలు రవీందర్, అశోక్ పాల్గొన్నారు.

పర్యటక కేంద్ర ఏర్పాట్లను పరిశీలిన

మహమ్మదాపూర్ గ్రామంలోని మహాసముద్రం గండిని పర్యటక కేంద్రంగా చేస్తామన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ సందర్శించారు. స్థానికులు, ప్రజాప్రతినిధులతో కలిసి మహా సముద్రం గండిని పరిశీలించి వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, సింగల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్థిక సంస్థగా ఎదిగిన బ్యాంక్ ఆఫ్ బరోడా

- వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం
- ఆవిర్భావ వేడుకల్లో వర్గల్ శాఖ మేనేజర్ మౌనిక



నవతెలంగాణ-వర్గల్

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా చక్కటి ప్రపంచ ఆర్థిక సంస్థగా ఎదిగినట్లు వర్గల్ శాఖ మేనేజర్ మౌనిక పేర్కొన్నారు. శనివారం వర్గల్ బ్యాంక్ ఆఫ్ బరోడా కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామీణ, వ్యవసాయ బ్యాంకింగ్ కార్యకలాపాలతో వినియోగదారుల ప్రశంసలు పొందుతున్నట్లు స్పష్టం చేశారు. చిరు వ్యాపారులు, రైతులు, వ్యాపారులను ఆర్థికంగా శక్తివంతం చేయాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ, గృహ, వాహన, చిరు వ్యాపారం, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రుణ సేవలందించడం, క్రెడిట్ కార్డులు, డిపాజిట్లు, సేవింగ్స్ పై అధిక వడ్డీ తదితర వాటిపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. అయితే వినియోగదారుడికి అగ్రశ్రేణి బ్యాంకుగా సేవలందించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. లాభదాయక, స్థిరత్వాన్ని నిర్ధారిస్తూ అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల అవసరాలు తీర్చడానికి సులభమైన, సురక్షితమైన సేవలను తమ సంస్థ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే 1908లో అప్పటి వడోదర మహారాజు సాయాజిరావు గైక్వాడ్ బ్యాంక్ ఆఫ్ బరోడాను స్థాపించగా, 1969లో భారత ప్రభుత్వ ఆమోదంతో జాతీయ ప్రభుత్వ బ్యాంకుగా రూపుదిద్దుకొని వందకు పైగా దేశాలలో విస్తరించి వివిధ రకాల సేవలందిస్తున్నట్లు వివరించారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

నవ తెలంగాణ - మిరుదొడ్డి



అక్బర్ పేట భూంపల్లి మండలం బేగంపేట గ్రామంలో రైతు పక్షపాతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అనసూయ ప్రతాప్, మాజీ ఉప సర్పంచ్ జగన్, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఒకేసారి రూ.లక్ష రుణమాఫీ చేయడం ఎంతో గర్వకారణం అని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో మొట్టమొదట రైతులను గుర్తించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కిందని అన్నారు. రెండో విడత కూడా 2 లక్షల రుణమాఫీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలోబేగంపేట గ్రామస్తులు, దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామి గౌడ్, మండల ఫిషర్ మ్యాన్ అన్నబోయిన చందు, బేగంపేట గ్రామ అధ్యక్షులు ఉద్దెమారి సతీష్, ఉపాధ్యక్షులు పోతారం ముత్యాలు, తాజా, బాల్నర్సు, నరేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం మల్చేరువు తండాలో రైతు



రుణమాఫీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ వీరాభిమాని గుగులోతు రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం సంబరాలు జరిపారు. తండాలలోని గిరిజనులు, పొలాల వద్ద వరి నాట్లు వేస్తున్న రైతులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా, ఏకకాలంలో రైతుల రుణమాఫీ చేయడం సంతోషకరమన్నారు. మొత్తం రాష్ట్రంలోనే రైతు రుణమాఫీలో హుస్నాబాద్ నియోజకవర్గానికి రెండవ స్థానంలో అత్యధిక నిధులు మంజూరు చేయించడానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా సంపత్, బానోతు రాజ్ కుమార్, బానోతు చరణ్, భద్రవ్వ, భూక్య గమ్మి, బానోతు చిలికి, పాల్గొన్నారు.

పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించండి

- ఎంపీడీవోకు మాజీ సర్పంచుల వినతి పత్రం



నవతెలంగాణ -గజ్వేల్

గత ఏడాదికాలంగా గ్రామ పంచాయతీలో పెండింగ్ బిల్లులు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని గజ్వేల్ మండలం తాజా మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్ ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు తూము శేఖర్ పటేల్, శివయ్య, బాలచంద్రం, పాండు, వెంకటేశం, లక్ష్మయ్య, చంద్ర గౌడ్, అశోక్ మాట్లాడుతూ తాము గ్రామ అభివృద్ధి చెందుతుందని డబ్బులు ఖర్చు చేసి పనులు చేశామని వాటిని వెంటనే చెల్లించాలని వారు కోరారు. గ్రామపంచాయతీలో జడ్పీటీసీ నిధుల కింద చేపట్టిన పనులకు ఇప్పటివరకు బిల్లులు మంజూరు కాలేదని వారు తెలిపారు. అదేవిధంగా గ్రామపంచాయతీ భవనాలను నిర్మించామని ఆ డబ్బులు కూడా ప్రభుత్వం చెల్లించలేకపోయింది అన్నారు. గ్రామపంచాయతీ భవనాలను నిర్మించి అప్పుల పాలు అయినట్లు ఆవేదన చెందారు. గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి పనులకు సొంత డబ్బులు పెట్టి చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. గత ఏడాదికాలంగా బిల్లులు పెండింగ్లో ఉంటున్నాయని వారు అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. గజ్వేల్ మండలంలో 25 గ్రామపంచాయతీలు ఉండగా ఇందులో కొన్ని గ్రామపంచాయతీలు నిధులు పూర్తిస్థాయిలో మంజూరు చేసుకున్నాయని వారు పేర్కొన్నారు. ఒక్కొక్క గ్రామపంచాయతీకి రూ.010 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు రావాలని వారు చెప్పారు.

సీఎంను కలిసిన ఓరుగంటి



నవతెలంగాణ-బెజ్జంకి

హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని రాష్ట్ర ఆహార భద్రత మండలి సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఆత్మీయ సన్మానం చేసినట్టు రాష్ట్ర ఆహార భద్రత మండలి సభ్యుడు ఓరుగంటి ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు.రాష్ట్రంలో ఆహార భద్రత చట్టం అమలవుతున్న తీరును ఆహార భద్రత మండలి సభ్యులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించినట్టు ఓరుగంటి తెలిపారు.

గ్రామాలకు ప్రమాదంగా మారిన రింగ్‌రోడ్డు

- ఎదురెదురుగా వచ్చి ప్రమాదానికి గురైన కార్లు
- సిద్దిపేటకు రింగురోడు... పక్క గ్రామాలకు ప్రమాదం



నవతెలంగాణ-తొగుట

సిద్దిపేటకు రింగురోడ్డు బాగానే ఉంది గాని పక్క గ్రామాలకు ప్రమాదంగా మారిందని ఆయాగ్రామల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు అయినప్పటి నుంచి ఘణపూర్, గుడికందుల మీదుగా వెళ్లే ఔటర్ రింగ్ రోడ్డు పై రోజురోజుకు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఇదే క్రమంలో గణపూర్ గ్రామం వద్ద శనివారం రెండు కార్లు ఎదురేదురుగా ఢీ కొన్నాయి. సిద్దిపేట ఔటర్ రింగ్ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు లేక తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయని రెండు గ్రామాల ప్రజలు వెల్లడించారు. ఇప్పటికైనా ఔటర్ రింగు రోడ్డు పై కాంట్రాక్టర్ తక్షణమే చర్యలు తీసుకొని సూచిక బోర్డులతోపాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.మండలం మీదుగా మల్లన్న సాగర్ ఔటర్ రింగ్ మొదలైనప్పటి మొదలుకొని వెంకటాపూర్ నుంచి తొగుట వరకు, సిద్దిపేట నుంచి దౌల్తాబాద్ వెళ్లే ప్రధాన రహదారులు గణపురం వద్ద కలవడంతో చౌరస్తాగా ఏర్పడిందన్నారు. నాలుగు రోడ్లు కలిసిన ప్రదేశంలో స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డులు లేక తరచు ప్రమాదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. వెంటనే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డు పై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరారు. రింగు రోడ్డుకు పక్కనే ఘనపూర్ ప్రభుత్వ పాఠశాల ఉందని విద్యార్థులు బయటకు వచ్చే సమయంలో వాహనదారుల వేగంతో రావడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉందని అన్నారు. గత పది రోజుల క్రితం గుడికందుల గ్రామానికి చెందిన వ్యక్తి ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలయ్యా రని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెంటనే అధికారులు స్పందించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యపై కేంద్రీకరణ చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

నవ తెలంగాణ - సిద్దిపేట

రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించి, విద్యపై దృష్టి కేంద్రీకరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ రెడ్డి, ప్రశాంత్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాకమిషన్ పై విద్యావిధానం గురించి, మేధావులతో చర్చల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందించాలని, ప్లేస్కూల్‌గా అంగన్వాడీ కేంద్రాలను మార్చి కేజీ నుంచి మూడో తరగతి వరకు విద్యను అందించి, తద్వారా 4 నుంచి 10వ తరగతి వరకు సెకండ్ విద్యను సెమీ రెసిడెన్షియల్ విద్య విధానం ద్వారా ప్రభుత్వం విద్యను అందించాలనే నిర్ణయం ప్రభుత్వ విద్యను తీవ్ర నష్టం చేసే చర్య అన్నారు. తక్షణమే ఈ ఆలోచనను విరమించుకొని, తెలంగాణ రాష్ట్రంలో ప్రైమరీ విద్య విధానాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఫౌండేషన్ విద్య పేరుతో నిర్వహించి, ప్రైమరీ తరగతులను నిర్వహించాలనే నూతన విద్యా విధానం 2020 ప్రతిపాదించిన ఆలోచలను తెలంగాణలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు అనిపిస్తుందని, రాష్ట్రంలో ఈ నిర్ణయం అమలు చేస్తే పేదప్రజలు, ప్రధానంగా బలహీన వర్గాలు, విద్యార్థులు నష్టపోతారని అన్నారు. ఒకపక్క తల్లితండ్రులు కేజీ తరగతుల ప్రభుత్వ రంగంలో నిర్వహించాలని డిమాండ్ చేస్తుంటే, ప్రభుత్వం అలాంటి ప్రయత్నం చేయకుండా అంగన్వాడి కేంద్రాలను ప్లే స్కూల్ గా మార్చి, ప్రభుత్వ విద్య సంస్థలను నిర్వీర్యం చేసే ఆలోచన విరమించుకోవాలని కోరారు. ప్రైమరీ ఎడ్యుకేషన్‌లో తెలుగుతోపాటు, ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి, ప్రభుత్వ రంగ విద్యను బలోపేతం చేయాలని అన్నారు. అసెంబ్లీలో ఎన్ఈపీకి వ్యతిరేకంగా తీర్మానం చేసి, పోరాడాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకోవాల్సిన చర్యలు గురించి విద్యార్థి సంఘాలతో చర్చలు జరపాలని కోరారు. వచ్చే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక బడ్జెట్ కేటాయించి, ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయాలని కోరారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-మద్దూరు



రైతు బీమా దరఖాస్తు చేసుకునే రైతులు వెంటనే రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మద్దూరు ఏఈఓ రాకేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బీమా లేని రైతులు జూన్ 28వ తేదీ లోపు పట్టా పాస్ పుస్తకం పొందిన రైతులు రైతు బీమా కోసం ఆగస్టు 8 వ తేదీ లోపున దరఖాస్తు చేసుకోవాలని కోరారు.1965 ఆగస్టు 14 నుంచి 2006 ఆగస్టు 14 వరకు పుట్టిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతు బీమాకు కావలసినవి అప్లికేషన్ ఫామ్, పట్టా పాస్ బుక్ జిరాక్స్, రైతు ఆధార్ జిరాక్స్, నామిని ఆదర్ జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలంలో జూన్ 28వ తేదీ వరకు పట్టా పాస్ బుక్‌లు పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండీ.అఫ్రోజ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎవరైనా రైతు దరఖాస్తు చేసుకోకపోతే ఇప్పుడు చేసుకోవాలన్నారు. రైతు బీమాకు రైతు యొక్క పుట్టిన తేదీ 1965 ఆగస్టు 14 నుంచి 2006 ఆగస్టు 14 వరకు ఉండాలని, దరఖాస్తు చేసుకోవడానికి దరఖాస్తు ఫామ్, పట్టా పాస్ బుక్, ఆధార్, నామిని ఆధార్ జిరాక్స్ కాపీలు అవసరమని, అందుబాటులో ఉన్న ఏఈఓ ల వద్ద దరఖాస్తులు చేసుకోవాలని, కడవేరుగు, పోతిరెడ్డిపల్లి, తాడూరు, చిట్యాల, దానంపల్లి గ్రామాలలో ఏఈఓలు లేని కారణంగా అక్కడి రైతులు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకోవడానికి ఆగస్టు 5 చివరి తేదీ అని పేర్కొన్నారు.



ఘనంగా మహంకాళి అమ్మవారి బోనాలు

నవతెలంగాణ- మిరుదొడ్డి



ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని మీరుదొడ్డి మండల కేంద్రంలో మున్నూరు కాపు ఆధ్వర్యంలో శ్రీ మహంకాళి అమ్మవారి బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఉదయాన్నే మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బైండ్ల పంబల వారి నృత్యాలు, ఆటలు, డప్పు చప్పుల మధ్య యువత కేరింతలతో శివసత్తుల ఊరేగింపుతో మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండాలని మాంకాళి అమ్మవారిని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి కోరికలు తీర్చాలని మొక్కుకున్నారు. అనంతరం మిరుదొడ్డి గ్రామానికి చెందిన కుంట నారాయణ అమ్మవారికి వెండి కిరటంను అమ్మవారికి అందించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవ తెలంగాణ - దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో జరుగుతున్న శ్రీ మహంకాళి బోనాల ఉత్సవాల్లో భాగంగా శనివారం కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఆలయ నిర్వాకులు చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు.మహంకాళి, దుర్గ మాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఆయన వెంట కాంగ్రెస్ దుబ్బాక మున్సిపల్, మండలాధ్యక్షులు నర్మెట ఏసురెడ్డి, కొంగర రవి, సీనియర్ నాయకులు శ్రీరామ్ నరేందర్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, శరభయ్య, పడాల వినయ్, శ్రవణ్ కుమార్, అన్వర్ హుస్సేన్, పలువురు కార్యకర్తలున్నారు.



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ- తూప్రాన్ : పోతాన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రోజున బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ వేడుకలు సమావేశం నిర్వహించడం జరిగింది. పోతాన్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన ఆర్వి రామారావు సంతోష్ సుజాత వసంత రేణుక లకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు బాగా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్వి రామారావు మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాల నుండి పోతాన్ పల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రారంభించేందుకు కృషి చేశానని, ఉన్నత పాఠశాల ఏర్పాటులో నాకు సహకరించిన ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు బాగారెడ్డి, మాజీ సర్పంచి సంతోషా సిద్ధిరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ అలీ, విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు బాలసాయి హరిప్రసాద్, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఆర్ వి రామారావు,సంతోష్,సుజాత వసంత,రేణుక, నూతనంగా పాఠశాలకు విచ్చేసిన ఉపాధ్యాయులు హరికిషన్ రెడ్డి,విష్ణు,సత్యానంద్,శిల్ప,వార్డు సభ్యులు నరేష్ గౌడ్, శ్రీకాంత్,ఎల్లం బిజెపి నాయకులు సల్ల వెంకటేష్, గ్రామ కోఆప్షన్ జాహిద్ అలీ, ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, తదితరులు హాజరయ్యారు.

నవతెలంగాణ
నమస్తే తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 21 జులై 2024 | www.navatelangana.com

మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం



నవతెలంగాణ-ములుగు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల రుణమాఫీలో భాగంగా లక్ష రూపాయల మాఫీ చేసి రైతులను అప్పుల నుంచి రుణ విముక్తులను చేయడంపై గజ్వేల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన ములుగులో ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి. మొదటి విడతగా రూ.లక్షలు రుణమాఫీకి శ్రీకారం చుట్టి మాఫీ చేయడం ఎంతో గర్వించదగ్గ విషయం అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులను రుణ విముక్తులను చేసి వ్యవసాయం దండగ కాదు ఓ పండగ అని రైతుల్లో నమ్మకాన్ని నిలబెట్టిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని కొనియాడారు. రాబోవు రోజుల్లో రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తారని ఇందులో ఎలాంటి అనుమానం లేదని స్పష్టం చేశారు.

కన్యకా పరమేశ్వరికి కూరగాయలతో అలంకరణ



నవ తెలంగాణ- దుబ్బాక

ఆషాడం మాస సందర్భంగా వాసవి మహిళా సంఘం ఆధ్వర్యంలో దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో గల వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి కూరగాయలతో అలంకరణ చేసి, విశేష పూజలు నిర్వహించారు.శనివారం గణపతి పూజ, కుంకుమార్చన, శ్రీ చక్ర అర్చన, లలిత సహస్రనామ పారాయణం వంటి విశేష పూజల అనంతరం అమ్మవారిని విభిన్న రకాల కూరగాయలతో 'శాకాంబరి మాతాగా అలంకరణ చేశారు.రాతి రోలు పై దంచిన గోరింటాకును అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మహిళలంతా తమ చేతులకు పెట్టుకున్నారు.ఈ వైదిక కార్యక్రమంలో వాసవి మహిళా సంఘం అధ్యక్షురాలు వెనిశెట్టి పద్మ, సభ్యులు పడకంటి వసంత, గంగం అనురాధ, చింత స్వరూప,నల్ల కళావతి, చింత లక్ష్మి, వైశ్య సంఘం అధ్యక్షులు వెనిశెట్టి సుభాష్, సభ్యులు ధనుంజయ్, చింతరాజు, పడకంటి రాజు పలువురు పాల్గొన్నారు.

డీఎంఅండ్‌హెచ్ఓను శుభాకాంక్షలు తెలిపిన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ



నవ తెలంగాణ - సిద్దిపేట

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా వచ్చిన పుట్ల శ్రీనివాసును తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) సిద్దిపేట జిల్లా కమిటీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు షేక్ వలిహమ్మద్, ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల మెడికల్ రియంబర్స్మెంట్ బిల్లులను సకాలంలో జీవో నెంబర్ 74 ప్యాకేజీ ప్రకారం విడుదలయ్యే విధంగా చూడాలని కోరినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విడతలవారీగా ఆరోగ్యని కి సంబంధించిన అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచనప్రాయంగా తెలియజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పూర్వాధ్యక్షులు సి. చంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర యాదగిరి, జిల్లా కోశాధికారి ఎం. కృష్ణ, జిల్లా ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ కే. కనకరాజు, జిల్లా ఆఫీస్ బేరర్లు జి. వెంకట కిరణ్, కే ప్రశాంత్ కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ టి. శివలింగం, జిల్లా కమిటీ సభ్యులు ఎస్. వెంకటేశం, సిహెచ్. రామచంద్రం, ఎండి. సాబీర్, బి.రాజేందర్, ఎస్. యాదయ్య , కే. శ్రీనివాస్, డి.రాజలింగం, జి. బిక్షపతి, వై. శ్రీనివాస్, కే. నరసింహులు , పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువలు కలిగి ఉండాలి

-ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉండాలి



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి కరీముద్దీన్ అధ్యక్షతన ఇంపాక్ట్ క్లాస్ నిర్వహించిన ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైలర్, పీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చిన్నతనం నుంచే విద్యతో పాటు ఉన్నత విలువలు కలిగి ఉండాలని ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు.ఉన్నత విద్య అవలంభించి తల్లిదండ్రులకు గురువులకు సమాజానికి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు అనంతరం పాఠశాల హెచ్ఎం కరీమోద్దీన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఇంపాక్ట్ ట్రైనర్‌గా గజ్వేల్ ఆర్ అండ్ఆర్ కాలనీ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ఇంపాక్ట్ క్లాస్ తీసుకోవడానికి వచ్చిన శశిధర శర్మకు ధన్యవాదాలు తెలుపుతూ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల బృందం ఆధ్వర్యంలో చిరు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు, పీఆర్‌టీయూ నాయకుడు వూడెం వేమారెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు షరీఫ్, బషీరొద్దీన్, కోదండరామ్ శర్మ, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల ఆవుల రాజి రెడ్డి

నవ తెలంగాణ-నర్సాపూర్

సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. మాసాయిపేట మండలానికి చెందిన రాజుల విజయ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఆమె చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుంచి రెండు లక్షల 50 వేల ఎల్ఓసి మంజూరు కాగా శనివారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా ఎల్ఓసి మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు వైద్య చికిత్సలు చేయించుకోవడం కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్ఓసి ఎంతో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత



నవతెలంగాణ-బెజ్జంకి

బెజ్జంకి లయన్ క్లబ్ మాజీ చెర్మెన్ చేరాల రవీందర్ తన జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామాగ్రి శనివారం అందజేశారు. క్లబ్ సభ్యులు బెజుగం ప్రసాద్, జానకి రాములు, బద్దం మల్లారెడ్డి, సత్తయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు

- అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించాలి
- షీ టీమ్, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించిన ఏసీపీ సతీష్



నవతెలంగాణ-కోహెడ

యువత గంజాయి, డ్రగ్స్‌లాంటి మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిస కావద్దని ఏసీపీ వాసల సతీష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కమీషనర్ ఆదేశాల మేరకు విద్యార్థిని విద్యార్థులకు మహిళల చట్టాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థులపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ దశలో చెడు వ్యసనాలకు భానిసకాకుండా ఏకాగ్రతతో విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అపరిచిత వ్యక్తులు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే నూతన చట్టాలు మహిళల రక్షణకు అండగా నిలుస్తున్నాయన్నారు. చిరు తగాదాలకు వెళ్ళి జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. షీ టీమ్స్ ప్రాముఖ్యత, నిర్వహించే విధులు, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, సోషల్ మీడియా, సైబర్ సెక్యూరిటీ, డయల్ 100 ప్రాముఖ్యతపై వివరించారు. మహిళలు గృహహింసకు వరకట్నం, శారీరకంగా, మానసికంగా హింసించే తదితర అంశాలపై స్నేహిత మహిళా సెంటర్లో నిర్వహించే కౌన్సిలింగ్ గురించి వివరించారు. విద్యార్థి దశ చాలా కీలకమని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించి క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని సూచించారు. జులై 1 నుంచి అమలైన నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్ 100, సిద్దిపేట షీ టీమ్ నెంబర్ 8712667434 కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు, హుస్నాబాద్ షీటీమ్ సభ్యులు సదయ్య, హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్‌లు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుల్‌లు కృష్ణ, శివకుమార్,పాల్గొన్నారు.

మండలంలో 9.8 మి.మీల వర్షం



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలో రోజంతా ఎడతెరిపి లేకుండా ముసురు పడుతున్నది. దాంతో మండలంలో 9.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. కాగా ఈ ముసురుతో సోయా, పత్తి, కంది, చెరుకు పంటలకు లాభం చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్త చేస్తున్నారు. మరోపక్క ఈ వర్షం వల్ల గంగ్వార్ ప్రధాన రోడ్డుపై గల గుంతల్లో నీరు నిలిచి వాహనదారులలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలకు పోలీసులు మెరుగైన సేవలందించాలి

- పోలీస్ సేవల కోసం అధికారులు, సిబ్బంది పని చేయాలి
- పెండింగ్ కేసులపై సమీక్ష సమావేశం,
- ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పని చేయాలి
- జిల్లా ఎస్.పి.ఉదయ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

మెదక్ జిల్లాలో ప్రజలకు మెరుగైన పోలీస్ సేవల కోసం అధికారులు సిబ్బంది పని చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి సిబ్బందితో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు నమోదైన గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలి, ఏఏ అంశాలు క్రోడికరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పని చేసి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలన్నారు. కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలన్నారు. ఎన్ బి డబ్ల్యు ల అమలు పెండింగ్ వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్, క్రైమ్, స్టేషన్ రైటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, తదితర విధులు నిర్వహించే సిబ్బందికి పలు సూచనలు చేస్తూ వారి పనితనాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేసి సైబర్ నేరాల నియంత్రణ గురించి సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి గ్రామాలలో పట్టణాలలో విజిబుల్ పోలిసింగ్ ప్రాముఖ్యత గురించి వివరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్.పి అడ్మిన్ మహేందర్, మెదక్ డి.ఎస్.పి రాజేష్, డి.సి.ఆర్.బి సిఐ మధుసూదన్ గౌడ్, ఎస్.బి.సి.ఐ సందీప్ రెడ్డి, సి.ఐ.లు, ఎస్.ఐ.లు సిబ్బంది పాల్గొన్నారు.

పరారీలో ఉన్న గంజాయి కేసు నిందితుడు అరెస్ట్



నవతెలంగాణ-రాయపోల్

గతంలో దౌల్తాబాద్ పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసులో అరెస్టు కాకుండా పరారీలో ఉన్న నిందితుడిని శనివారం వర్గల్ మండలం గౌరవరంలో అదుపులోకి తీసుకున్నారు. గంజాయి కేసు నిందితుడిపై దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ కేస్ నమోదు చేయగా, రాయపోల్ ఎస్ఐ రఘుపతి కేసు దర్యాప్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన ఉమేష్ సింగ్ అక్రమ గంజాయి రవాణా చేస్తూ ఎంతో మంది యువకులను గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు చేస్తున్నట్లుగా సమాచారం ఉండడంతో అతనిపై గతంలో దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. అప్పటి నుంచి ఉమేష్ సింగ్ పరారీలో ఉన్నాడని తెలిపారు. కేసు నమోదయినప్పటి నుంచి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఉమేష్ సింగ్‌ను వర్గల్ మండలం గౌరరంలో అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వెంటనే నిందితుడిని గజ్వేల్ కోర్టులో హాజరు పరిచి, కోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఇలాంటి సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం శిక్షించబడతారన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలను అక్రమ రవాణా చేస్తూ వ్యాపారం చేసినా, యువతను చెడు వ్యసనాలకు బానిసలుగా చేసినా అలాంటి వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్, రాయపోల్ ఎస్సై రఘుపతి అన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్, దౌల్తాబాద్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ జరగలేదు

- బీజేపీ పట్టణ అధ్యక్షులు మనోర యాదవ్



నవతెలంగాణ-గజ్వేల్

ఉమ్మడి మెదక్ డీసీసీబీ పరిధిలో సుమారు 42 వేల మంది రైతులు రూ.లక్ష లోపు రుణమాఫీ అర్హులు కానీ కేవలం 19,542 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారు. బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ డీసీసీబీ పరిధిలో 162 కోట్లు మాఫీ కావాల్సి ఉంది కానీ కేవలం 75 కోట్లు మాత్రమే మాఫీ చేసినట్టు చెప్పారు. అంటే కేవలం 45 శాతం మంది రైతులకు మాత్రమే మాఫీ అయిందన్నారు. రైతులకు ఏం ఉద్ధరించిందని కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు చేస్తుందిన్నారు. రబీ, ఖరీఫ్ సీజన్లలో హామీ ఇచ్చిన రైతు భరోసా మొత్తాన్ని పంపిణీ చేయడంలో విఫలమైనందుకా లేక రుణ మాఫీపై ఆంక్షలు విధించి రైతులను మోసం చేసినందుకా, పంట నష్టానికి పరిహారం ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు.ఈ రుణమాఫీ డ్రామా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందడానికే రబీ, ఖరీఫ్ సీజన్లలో రైతుల రైతుభరోసా, కౌలు రైతులకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఎందుకు ఇవ్వలేదున్నారు.ఈ విలేకరుల సమావేశంలో నాయకులు గురువారెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన

శేరిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్

నవతెలంగాణ-రాయపోల్



ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలకు దీటుగా విద్య బోధన చేస్తున్నారని, శేరిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ అన్నారు. శనివారం ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యాబోధన చేయడం జరుగుతుందని, ప్రతి తరగతిలో 70 శాతం మంది విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్ట్ లలో చదవడం, రాయడం చతుర్వేద ప్రక్రియలు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం 30 విద్యార్థులు పైగా అడ్మిషన్ పొందుతున్నారని ఈ సంవత్సరం 38 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. ప్రతి విద్యార్థి ప్రగతిని ప్రతి నెల జరిగే తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంలో తల్లిదండ్రుల ముందు ప్రదర్శించడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రతి తరగతికి వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి విద్యార్థులకు ఇచ్చే హోంవర్క్ ను తల్లిదండ్రులకు పంపించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయుల సమిష్టి కృషి తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో పాఠశాల ప్రగతి బాటలో నడుస్తుందన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రం నుంచి 75 మంది విద్యార్థులు శేరిపల్లి పాఠశాలకు విద్యను అభ్యసించడానికి వస్తున్నారు. వారానికి రెండుసార్లు యోగ, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. రీడింగ్ కార్నర్, లైబ్రరీలో పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉంచడంతో భాషపై పట్టు సాధిస్తూ, రీడింగ్ స్కిల్స్ పెంపొందించుకుంటున్నారు. తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంలో విద్యార్థుల ప్రగతి హాజరు, ప్రవర్తన, పాఠశాల అభివృద్ధి వంటి అంశాలపై చర్చించడం జరిగిందన్నారు. శేరిపల్లి ప్రాథమిక పాఠశాలకు తమ విద్యార్థులను పంపించినందుకు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవి, శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు...

ముమ్మరంగా కొనసాగుతున్న ఉజ్జయిని మహంకాళి జాతర ఏర్పాట్లు.



నవతెలంగాణ - తూప్రాన్

తూప్రాన్ పురపాలక సంఘం పరిధిలోని మహంకాళి అమ్మవారి ఆలయం దగ్గర ఉత్సవాలు సమీపిస్తున్నందున మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో ఆలయ పరిసర ప్రాంతాల్ని డోజర్ ట్రాక్టర్ తో చదును చేయించారు.పురపాలక సంఘం అధ్వర్యంలో స్పెషల్ సానిటేషన్ చేపట్టి పిచ్చి మొక్కలు తీసివేయుట, నేలను చదును చేయుట మరియు రాళ్లను తీసివేయుట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రెటరీ బదిలీలు పూర్తి

నవతెలంగాణ-న్యాల్‌కల్

నాలుగు సంవత్సరాలుగా ఓకే మండలంలో పనిచేసిన అధికారులకు బదిలీ ప్రభుత్వం చేసింది 12 గ్రామాల పంచాయతీ సెక్రెటరీలకు జిల్లా కలెక్టర్ బదిలీ చేసినట్లు ఎంపీడీవో సురేష్ తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శులు రవీందర్ - మాచిరెడ్డిపల్లి , నాగభూషణం - ధనసిరి , నరసింహులు - పైడి గుమ్మల్ , ఈశ్వర్ - చిల్లపల్లి తాండ , జ్యోతిర్మయి - బోరేగావ్ , రవీందర్ - వనంపల్లి , సునీల్ సింగ్ - జంగి (కె) , శోభారాణి - సిరూర్ , చరణ్ రాజ్ - మేడి కుంద వారిని ఆయా గ్రామ పంచాయతీలకు బదిలీ ఆర్డర్స్ వచ్చాయని ఎంపీడీవో పేర్కొన్నారు సోమవారం వారి స్థానంలో కొత్త సెక్రెటరీలు విధుల్లో చేరనున్నారు.

ప్రజా సేవలో రోటరీ క్లబ్



గవర్నర్ వి హన్మంత రెడ్డి

నవతెలంగాణ-మర్కుక్ : సేవతోనే మనశాంతి ఉంటుందని, ప్రతి ఒక్కరూ సేవ భావం అలవర్చుకోవాలని, రోటరీ క్లబ్ సమాజ సేవా కార్యక్రమాలలో ముందుంటుని రోటరీ క్లబ్ గవర్నర్ వి.హన్మంతరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎర్రవల్లి సామూహిక ఫంక్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ సర్వసభ సమావేశం నిర్వహించి నూతన అధ్యక్ష కార్యదర్శిలను ఎన్నుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ నూతన అధ్యక్షులుగా ఎర్రవల్లి గ్రామానికి చెందిన తుమ్మ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రమణాకర్, కోశాధికారిగా నరసింహ్మా యాదవ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమ ముఖ్య అతిథిబండారు రామ్మోహన్ రావు హజరైయ్యారు. జిల్లా ఎకనామికల్ డెవలప్మెంట్ అధ్యక్షులు రమణ, రిజినల్ కల్చరల్ అధ్యక్షులు చంటి, మాజీ అధ్యక్షులు పాండరి, అసిస్టెంట్ గవర్నర్ వెంకట్ రెడ్డి, మాజీ అసిస్టెంట్ గవర్నర్ హరిశంకర్,సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, నర్సిహ్మారెడ్డి, విద్యా వికాస్ రెడ్డి, బిక్షపతి, గీసు మల్లేశం, రాములు, శివ, చారి, ఐలయ్య, బాలచంద్రం, సత్యం, అంజనేయులు, రోటరీ క్లబ్‌లో నూతన సభ్యత్వం తీసుకున్న సభ్యులు, తదితరులున్నారు.

లబ్ధిదారులకు ఉచితంగా వంటగ్యాసుల పంపిణీ

మోడీ గారికి మహిళల కృతజ్ఞతలు

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేపూర్ మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో శనివారం ప్రధానమంత్రి మోడీ ప్రవేశపెట్టిన ఉజ్వల పథకంలో భాగంగా అర్హులైన మహిళలకు ఉచితంగా వంటగ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని బీజేపీ మండల సోషల్ మీడియా కన్వీనర్ వట్టల శ్రీకాంత్ అన్నారు. అందుకుగాను ఆ మహిళలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహిళల జీవితంలో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. ఉచితంగా పేద మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, బీజేపీ పార్టీకి ప్రత్యేక కృతజ్ఞతను తెలిపారు.ఈ కార్యక్రమంలో ధర్మారం బీజేపీ పార్టీ గ్రామ అధ్యక్షులు వట్టెల బాలమల్లు యాదవ్ సీనియర్ నాయకులు పయితర నరసింహారెడ్డి, మండల్ సోషల్ మీడియా కన్వీనర్ వట్టల శ్రీకాంత్ యాదవ్, పార్టీ నాయకులు చిట్టమైన కృష్ణ, ఇటమైన హరీష్, గజం కుమార్, జగదేపూర్ బీజేపీ పార్టీ కార్యదర్శి బత్తుల వెంకటేశం, ఇష్టమైన శీను, తదితరులు పాల్గొన్నారు....

అంగన్‌వాడీలో అక్షరాభ్యాస కార్యక్రమం



నవతెలంగాణ-కోహెడ : మండల కేంద్రంలోని అంగన్ వాడీ కేంద్రం-2లో సీడీపీవో జయమ్మ ఆధ్వర్యంలో చిన్నారులు, తల్లిదండ్రులతో కలిసి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులకు ఓనమాలు రాయించి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను ఇంట్లో తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు చదువుపై మక్కువ పెంచే విధంగా ఆలోచింప చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, ఏఎన్ఎం మంజుల, ఆశా కార్యకర్తలు కొంకటి అశ్విని, వెల్దండి కవిత, మొగురం పద్మ పొన్నాల పుష్పలత, వీవో హేమలత, అధ్యక్షురాలు స్రవంతి, ఆయా లక్ష్మి చిన్నారుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.